నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 15-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:155 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

నవవిధ భక్తులతోడుత
ప్రవిమలముగ పరమశివుని ప్రార్థించినచో
శివరాత్రి పర్వదినమున
భవహరు డందుంచు గాత పలు విజయములన్ !!

(ఫిబ్రవరి 15 శివరాత్రి...)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

ప్రజలెటూ తేల్చకోని
పట్టణాల్లో హంగ్ పాగ
అన్ని తన్నుకెళుతుందా
అధికారం పవర్ దేగ

దారికాచి ఓట్లు దోచే
ధనస్వామ్యం పైచేయి
జబర్దస్తీ విసురుతుంది
జనస్వామ్యంపై రాయి

-వేల్పుల నారాయణ
9440433475

కేంద్ర క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయాలకు ఆమోదం..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ప్రధానమంత్రి నరేంద్రమోదీ (ఖఓ ఔజీతీవనిటతీజీ ఓనీతతి) అధ్యక్షతన ఈరోజు (శనివారం) కేంద్ర క్యాబినెట్ నమావేశం (జనితినీని అజీఎతినివబి ఓవవబితినిన) అయింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ.1,60, 504 కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

గోహుపూర్-నుమాలిఘర్ మధ్య అండర్ వాటర్ రోడ్డు టన్నెల్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. 34 కిలోమీటర్ల మేర అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ టన్నెల్ నిర్మాణంతో 250 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా 6 గంటల సమయం పట్టే గమ్యస్థానాన్ని కేవలం 20 నిమిషాల్లోనే చేరు కునే అవకాశం ఉంది. బ్రహ్మపుత్ర నది కింద రైల్వేలైన్, నేషనల్ హైవే కోసం టన్నెల్‌ని నిర్మిం చనుంది. అలాగే కసారా-మన్మాడ్ మూడు, నాలుగో రైల్వేలైన్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

బళ్లారి-హోస్పేట మధ్య రూ.2,372 కోట్లతో 3, 4 రైల్వేలైన్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆవోదించింది. గూడె బేల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ.3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్ , నారాయణపేట, రాయచూర్, దేవరకద్ర, హైదరాబాద్‌కు ఈ కనెక్టివిటీ ఉంది. హైదరాబాద్- పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3175 కోట్ల ఖర్చు చేయనుంది. దమాసియా-బిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి రూ.4,584 కోట్లను ఖర్చు చేయనుంది. గోతి- ట్రిమ్బుక్ - పాల్గర్ సెక్షన్ అబ్రిడేషన్ కోసం రూ.3320 కోట్లని కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

మున్సిపల్ జోష్.. రైతులకు సర్కార్ గుడ్‌న్యూస్..!

హైదరాబాద్, ఫిబ్రవరి 14: తెలంగాణ ప్రభుత్వం (వశ్రీజీనిణజీనిజీ ఉనీలబి) త్వరలోనే రైతులకు గుడ్ న్యూస్ చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా డిసైడ్ చేసినట్లు తెలుస్తోంది.

ఈరోజు (శనివారం) సాయంత్రం 6 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి తన నివాసంలో మంత్రులతో కీలక సమావేశం నిర్వహించ నున్నారు. ఈ సమావేశంలో రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం ఉంది. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

రంగారెడ్డి జిల్లాలో న్యాయవాది దారుణ హత్య

రంగారెడ్డి, ఫిబ్రవరి 14: : జిల్లాలోని అత్తాపూర్‌లో దారుణం చోటు చేసుకుంది. దుండగులు న్యాయవాది ని దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం రేపుతుంది. అత్తాపూర్‌లోని సులే మాన్ నగర్‌లో సొంత ఆఫీసులో న్యాయవాది మహమ్మద్ ఖదీర్ పనిచేసుకుంటుండగా అతడిపై దుండగులు కత్తులతో దాడి చేసి చంపి పారిపోయారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరు కుని క్లూస్ టీమ్ సహకారంతో ఆధారాలు సేకరించారు. కుటుం బ విభేదాల కోణంలో బామ్మ ర్దులపై అనుమానం వ్యక్తం చేశా రు.సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు మొదలు పెట్టారు.హత్యకు గల అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్గో లారీని ఢీకొట్టిన కారు.. మహిళతో సహా ఐదుగురు మృతి



జైపూర్, ఫిబ్రవరి 14: కార్గో లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ కారులోని మహిళతో సహా ఐదుగురు మరణించారు. కారు డ్రైవర్ నిద్రలో జోగడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌కు చెందిన ఒక కుటుంబం తీర్థయాత్ర కోసం కారులో బయలుదేరింది. ఫిబ్రవరి 13న ఉజ్జయినీలోని మహాకాళేశ్వర్ ఆలయాన్ని వారు దర్శించారు. ఆ తర్వాత రాజస్థాన్‌లోని ఖాతు శ్యామ్ జీ ఆలయానికి కారులో ప్రయాణమయ్యారు.

కాగా, శనివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో కోట?జైపూర్ జాతీయ రహదారి 52పై ముందు వెళ్తున్న కార్గో లారీని ఆ కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. అందులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి చనిపోయాడు.

మరోవైపు మృతులను రేష్మా శ్రీవాస్తవ, పియూష్ రాయ్, రాహుల్ రాజక్, షాను, డ్రైవర్ అనురాగ్‌గా పోలీసులు గుర్తించారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌కు చెందిన నివాసితులని తెలుసుకున్నారు. వారి కుటుంబాలకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రలోకి జారుకోవడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నదని పోలీస్ అధికారి తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రేపు అమరావతికి బిల్‌గేట్స్.. హెల్త్‌కేర్ రంగంలో 'గేమ్ ఛేంజర్': సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 14: మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ సోమవారం (ఫిబ్రవరి 16) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇవాళ(శనివారం) అమరావతిలో పార్టీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన భేటీలో సీఎం చంద్రబాబు ఈ విషయం వెల్లడించారు. 'ఎల్లుండి అమరావతికి బిల్ గేట్స్ వస్తున్నారు. బిల్ గేట్స్‌ను 3 సార్లు ఏపీకి తీసుకొచ్చిన ఘనత నాదే' అని సగర్వంగా ప్రకటించారు. తొలిసారి హైటెక్ సిటీ (హైదరాబాద్) కోసం, రెండోసారి విశాఖ అగ్రిటెక్ కోసం గేట్స్‌ను రప్పించానని, ఇప్పుడు సంజీవని పథకం కోసం పిలిపిస్తున్నామని వివరించారు

ఆరోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చే లక్ష్యంతో సంజీవని పథకం రూపొందుతోంది. బిల్ ఉ మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఈ పథకం ద్వారా గ్రామీణ ఆరోగ్య సేవలు, వ్యాక్సినేషన్, మాతా శిశు సంరక్షణ వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, సంజీవని పథకం అనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 2025లో ప్రవేశపెట్టిన టెక్నాలజీ ఆధారిత ప్రజా ఆరోగ్య కార్యక్రమం. ఇది రాష్ట్రాన్ని 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'గా మార్చడం, ప్రతి పౌరుడికీ డిజిటల్ హెల్త్ రికార్డులు, ముందస్తు రోగ నిర్ధారణ, ఉచిత, సులభ వైద్య సేవలు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

భక్తుల దర్శనానికి విస్తృత ఏర్పాట్లు..

-వచ్చే భక్తులకు అన్ని సేవలకు అధికారులు అప్రమత్తం..
-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా..

శ్రీశైలం, ఫిబ్రవరి 14: నంద్యాల జిల్లాలోని శ్రీశైలం మహా శ్రీ భ్రమరాంబిక మల్లికా ర్జున స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివరాత్రి రోజున సుమారు 1.50 లక్షల మంది భక్తులు శ్రీశైలానికి తరలివచ్చే అవకాశమున్న నేపథ్య లో అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపా రు. శనివారం నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఆలయ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాలను ఆమె స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శివరాత్రి రోజున సుమారు 20 గంటల వ్యవధిలో భక్తులు ప్రశాంతంగా, సౌకర్యవంతంగా దర్శనం చేసుకునే విధంగా సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు అర్ధగంట వ్యవధిలోనే శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం లో స్వామివారి, అమ్మవార్ల దర్శనం పూర్తి చేసుకునేలా క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లు, ప్రసాద పంపిణీ వ్యవస్థలను సమర్థవంతంగా ఏర్పాటు చేశామని తెలిపారు. దర్శనం అనంతరం భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

శుక్రవారం రోజున దాదాపు 80 వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకోవడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామివారి ప్రసాదం, దేవస్థాన భోజన వసతి అందించి సాఫీగా నిర్వహించగలిగామని కలెక్టర్ వివరించారు.

బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు భక్తులు ఇదే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే దృష్ట్యా టోల్ గేట్ రుసుము మినహాయింపు, రాత్రి వేళల్లో ప్రయాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. అటవీ మార్గంలో పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం 13 ప్రాంతాల్లో త్రాగునీరు, అన్నదానం, వైద్య సేవలు, చలువ పందిళ్లు తదితర నదుపాయాలతో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

అటవీ మార్గంలో ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే చికిత్స అందించేందుకు 7 అంబులెన్సులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అవసరమైతే స్ట్రెచర్ల ద్వారా సమీప ఆసుపత్రులకు తరలించే చర్యలు కూడా చేపట్టినట్లు చెప్పారు.

అటవీ ప్రాంతంలో ప్రయా ణించే భక్తులు తగు జాగ్రత్తలు పాటిస్తూ శివనామస్మరణతో దర్శనం పూర్తి చేసుకుని సురక్షిత ంగా స్వస్థలాలకు చేరుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం...

-సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్
-భీమేశ్వర ఆలయంలో పూజలు
-ఆర్టీసీ ఉచిత రవాణా బస్సు ప్రారంభం

రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి 14: నేటినిజం ప్రతినిధి): రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సి పల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శిం చుకునేందుకు వేములవాడకు రాగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్చం అందజేసి, స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో అర్చకులు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీని వాస్ రాజ్ కు స్వస్తితో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భం గా ఆయనకు అర్చకులు స్వామి వారి ప్రసాదాన్ని అందజేసి, ఆశీ ర్వచనం అందించారు. ఆలయ విస్తరణ పనుల పరిశీలనరాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబం ధించిన ఫోటోలు పరిశీలించారు. పనులపై పలు సూచనలు చేశారు.ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభంవేములవాడ తిప్పా పూర్ బస్టాండ్ నుంచి ఆలయం దాకా భక్తులను ఉచితంగా తరలించే ఆర్టీసీ బస్సులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రార ంభించారు. ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలిరాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయా లని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. రాజన్న ఆలయ విస్తరణ, అభి వృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులు, ఆర్కిటెక్ట్ మూర్తి, కాంట్రాక్టర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు.

పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. పనుల పురోగతి లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సమన్వయంతో పరిష్కరి ంచాలని తెలిపారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నూతన గోశాల నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. ఇప్పుడు ఉన్న గోశాలలో ఎన్ని కోడెలు ఉన్నాయని ఆరా తీశారు. వాటి సంరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్ కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేసి వివరించారు. సమావేశంలో ఆర్అండ్ బీ సీఈ రాజేశ్వర్, ఎన్ఈ రాములు ఈఈ నరసింహాచారి, ఆలయ ఈఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అష్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీం దర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో మహాజాతర

- 175 సీసీ కెమెరాలతో కట్టుదిట్టమైన పర్యవేక్షణ

వేములవాడ, ఫిబ్రవరి 14: మహాశివరాత్రి జాతర సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ప్రాంగణంతో పాటు పట్టణ కేంద్రంలోని కీలక ప్రాంతాల్లో మొత్తం 175 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.ఈ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి జాతర ప్రాంగణం, ట్రాఫిక్ రద్దీ, క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగి స్తున్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తిన వెంటనే కమాండ్ కంట్రోల్ నుండి వైర్లెస్ సెట్ ద్వారా సంబంధిత సిబ్బందికి సమా చారాన్ని చేరవేస్తున్నారు.భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామి వారి దర్శనం చేసుకు నేలా, అలాగే అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో మతాన్ని రెచ్చగొట్టినా బీజేపీ ఏం సాధించలేకపోయింది: మహేశ్ గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14: నిజామాబాద్ కార్పొరేషన్‌ను తామే కైవసం చేసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో ఈరోజు (శనివారం) సమావేశం అవుతా నని.. ఈ భేటీలో కార్పొరేషన్‌ల గురించి చర్చించి అన్ని నిర్ణయా లు తీసుకుంటామని చెప్పుకొ చ్చారు. హైదరాబాద్ వేదికగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. కరీంనగర్ కార్పొరే షన్ కూడా తమ ఖాతాలోకే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీపీఐ నేతలతో మాట్లాడుతున్నామని అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ విషయం లో సరైన నిర్ణయం తీసుకుం టా మని తెలిపారు. జగిత్యాలలో కాం గ్రెస్ వారే ఛైర్మన్‌గా ఉంటారని స్పష్టం చేశారు.మున్సిపల్ ఎన్నిక ల్లో మతాన్ని రెచ్చగొట్టినా బీజేపీ ఏం సాధిం చలేకపోయిందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శిం చారు. ఈ ఎన్నికల్లో 90 శాతం గెలవాలని రూల్ ఏమైనా ఉం దా.. అని ప్ర శ్నించారు. కవితకు ఈ ఎన్నికలు ఉత్సాహాన్ని ఇచ్చి ఉండవచ్చని అన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభావం ఉ ండదని చెప్పుకొచ్చారు. జడ్పీటీసీ, ఎంపీ టీసీ ఎన్నికల్లో కూడా అత్యధిక స్థానాలను గెలుస్తామని జోస్యం చెప్పారు. హైదరాబాద్ గ్రేటర్ ఎన్నికల్లో కూడా తామే విజ యం సాధిస్తామని మహేశ్ కుమా ర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

శివరాత్రి జాగరణ ఉపవాసాలతో శాంతి సౌభాగ్యాలు

(15 ఫిబ్రవరి "మహాశివరాత్రి పర్వదినం" శుభ సందర్భంగా)

మహాశివరాత్రి పర్వదినం అనగానే ఉపవాసాలు, రాత్రంతా జాగరణలు గుర్తుకొస్తాయి. ఆ రోజు శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడుతాయి. భక్తుల హరి నామస్మరణలతో ఆలయాలు మారుమోగుతాయి. పరమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ ఈశ్వరుడి అనుగ్రహం పొందుతారు. దూరవిద్య కాలం సరిపడినంత ఉపాసన శివరాత్రి రోజు సుసాధ్యం అవుతుందని భక్తి కోటి నమ్మకం. అందుకే కదా జన్మతో శివరాత్రి అని పిలుస్తాం. అతి పవిత్రమైన తిథి మహాశివరాత్రి. మాఘమాసం కృష్ణ పక్షంలో అర్ధరాత్రి సమయానికి చతుర్దశి పరివ్యాప్తం అయితే దానిని మహాశివరాత్రి అని పాటిస్తాం. 15 ఫిబ్రవరి 2026 పుణ్య గడియల్లో పరమశివుడు లింగాకారంగా ఆవిర్భవించాడు. కరచరనాదులు లేని అపురూప దైవం శివలింగం. జ్యోతి స్వరూపంతో ఆవిర్భవించిన జ్యోతిర్లింగం కాబట్టి అది అజ్ఞాన చీకట్లను చిదిమేసే వెలుగులని నమ్ముతారు.

ఉపవాసం, జాగరణలు ప్రత్యేకం:

ఈ ఏడాది శివరాత్రి 15 ఫిబ్రవరి సాయంత్రం ప్రారంభమై, 16 ఫిబ్రవరి సాయంత్రం వరకు కొనసాగుతుంది. మహాశివరాత్రి నాడు ఉపవాసం, జాగరణ రెండూ పాటిస్తారు. శివరాత్రి రోజు శివలింగానికి అభిషేకం చేస్తే లోకమంతా చల్లబడుతుందని, కోరికలు తీరుతాయని, శాంతి/సౌఖ్యం/అభివృద్ధి కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ పర్వదినం రోజున బిల్వ పత్రాలతో పాటు తుమ్మి పూలతో అర్చన చేయడం, పంచామృతాలతో అభిషేకాలు చేయడం, ఈశ్వర భజనలు చేయడం, జాగరణ సమయంలో శివయ్యను ఆరాధించడం వల్ల జన్న జన్మల పాపాలు తొలగిపోతాయని చెబుతారు. భోళాశంకరుడి ప్రసన్నానికి అత్యంత భక్తి ప్రపత్తులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అసత్య అబద్దాలకు దూరంగా, క్రోధావేశాలను అణచి చేసుకుంటూ, ప్రశాంతంగా శివ శివ అంటూ సంభోదించడం పరిపాటిగా మారింది. తెల్లని వస్త్రాలు ధరించి, నుదుట/వక్షస్థలం/భుజాలపై విభూతి ధరించి పూజలు చేయడం మంచిది. పార్థివ (మట్టితో చేసిన) లింగ పూజ చేస్తూ "నమః శివాయ" లేదా మహామృత్యుంజయ మంత్రాన్ని 108 సార్లు జపించడం లేదా స్మరించుకోవడం చేస్తారు.

ప్రాపంచిక కోరికలు, ఇంద్రియ సుఖాల విషయంలో నిగ్రహం పాటిస్తూ, ఆధ్యాత్మిక జ్ఞాన మార్గంలో నడవడమే అసలైన శివరాత్రి జాగరణ అని తెలుసుకోవాలి. 'ఉప(దగ్గర)', 'వాసం(నివాసం)' అనగా శివుడికి దగ్గరగా ఉండమని తెలుసుకోవాలి. శివాలయంలో శివలింగానికి ఎదురుగా, కైలాసానికి ద్వారపాలకుడిగా, గణాలన్నింటికీ అధిపతిగా, శివయ్య వాహనంగా నియమింపబడిన నందిని కూడా దర్శించుకోవడం ఆచారంగా భావిస్తారు.

నమః శివాయ : నమః శివాయ : నమః శివాయ

-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

బార్బడోస్ ఎన్నికల్లో ప్రధాని మియా అమోర్ మోట్‌లీ వరుసగా మూడో సారి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: బార్బడోస్ ఎన్నికల్లో వరుసగా మూడో సారి విజయాన్ని సాధించి చరిత్ర సృష్టించిన ప్రధాని మియా అమోర్ మోట్‌లీకి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. బార్బడోస్ దీర్ఘకాలిక మైత్రికి భారత్ ఎనలేని ప్రాధాన్యా న్నిస్తోందనీ, పరస్పర సహకారాన్ని వివిధ రంగాల్లోకి విస్తరింపచేసుకొంటున్నామనీ శ్రీ మోదీ అన్నారు. "2024లో భారత్-కేరికామ్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మనం భేటీ అయిన సంగతిని నేను గుర్తు చేసుకొంటున్నాను. మన రెండు దేశాల ప్రజల హితాన్ని కోరుకుంటూ మన భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠపరుచుకోవడానికి ఆమెతో కలిసి పనిచేయాలని నేను ఎదురుచూస్తున్నాను" అని శ్రీ మోదీ అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ఒక సందేశాన్ని ప్రధాన మంత్రి శ్రీ మోదీ పొందుపరుస్తూ -"ఎన్నికల్లో వరుసగా మూడో సారి గెలిచి, చరిత్రను సృష్టించినందుకు ప్రధాని మియా అమోర్ మోట్‌లీకి హృదయపూర్వక అభినందనలు.

బార్బడోస్ తో భారత్ తన దీర్ఘకాలిక మైత్రికి ఎంతో ప్రాధాన్యాన్నిస్తోంది.. ఈ మైత్రి వివిధ రంగాల్లో పరస్పర సహకారం రూపేణా నిరంతరాయంగా విస్తరిస్తోంది.

2024లో భారత్-కేరికామ్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మనం సమావేశమైన సంగతి నాకు జ్ఞపకముంది. మన ప్రజల మేలు కోసం మన భాగస్వామ్యాన్ని మరింత దృఢపరుచుకోవడానికి ఆమెతో కలిసి పనిచేయాలని నేను ఎదురుచూస్తున్నాను" అని పేర్కొన్నారు.

'నాగరికదేవో భవ' స్ఫూర్తితో 'సేవా తీర్థ్'ను జాతికి అంకితం చేసిన ప్రధానమంత్రి కర్తవ్యం, కరుణ, ఇండియా ఫస్ట్ దార్శనికత పట్ల నిబద్ధతకు చిహ్నంగా 'సేవా తీర్థ్'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సేవా తీర్థ్‌ను జాతికి అంకితం చేశారు. భారత ప్రజలకు సేవ చేయాలనే తన అచంచల సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తూ... 'నాగరికదేవో భవ' పవిత్ర స్ఫూర్తిని దానికి మార్గదర్శక శక్తిగా ప్రకటించారు.

సేవా తీర్థ్ అంకితభావం... ప్రజాసేవ, పౌరుల సంక్షేమాల పట్ల లోతైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని శ్రీ మోదీ పేర్కొన్నారు.

కర్తవ్యం, కరుణ, 'ఇండియా ఫస్ట్' దార్శనికత పట్ల నిబద్ధతలకు 'సేవాతీర్థ్' ప్రకాశవంతమైన, శక్తిమంతమైన చిహ్నంగా నిలుస్తుందని ప్రధానమంత్రి అన్నారు.

నిస్వార్థ సేవ చేస్తూ, ప్రజా సంక్షేమం కోసం అవిశ్రాంత అంకితభావంతో తర్వాతి తరాలు ముందుకు సాగేందుకు ఇది స్ఫూర్తినిస్తుందనీ, ప్రజలనూ ఈ దిశగా ముందుకు నడిపిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

"భారత ప్రజలకు సేవ చేయాలనే అచంచలమైన సంకల్పంతో... నాగరిక్ దేవో భవ అనే పవిత్ర భావన మార్గదర్శనంతో... సేవా తీర్థ్‌ను సవినయంగా జాతికి అంకితం చేశాం. సేవా తీర్థ్ ఎల్లప్పుడూ కర్తవ్యం, కరుణ, ఇండియా ఫస్ట్ దార్శనికత పట్ల నిబద్ధతలకు ప్రకాశవంతమైన చిహ్నంగా నిలుస్తుంది. ఇది తరతరాలు నిస్వార్థ సేవతో, ప్రజలందరి సంక్షేమం పట్ల అవిశ్రాంత అంకితభావంతో ముందుకు సాగేందుకు స్ఫూర్తినిస్తుంది."

రూ.10,000 కోట్ల మూలనిధితో స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0 ఏర్పాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: సేవా తీర్థ్‌కు మారిన తరువాత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీసుకున్న తొలి నిర్ణయాల్లో సేవా స్ఫూర్తి ఉట్టిపడింది.. ఆయన సంతకాలు చేసిన ముఖ్య దస్త్రాలలో సమాజంలో ప్రతి ఒక్క వర్గానికీ సంబంధించినవి ఉన్నాయి. ఆ వర్గాల్లో ప్రధానంగా రైతులు, మహిళలు, యువతీ యువకులతో పాటు బలహీన వర్గాల పౌరులు ఉన్నారు.

పీఎమ్ రాహత్ పథకం: దేశ పౌరులలో ప్రతి ఒక్కరికీ సంబంధించిన ప్రాణ రక్షక కవచం.

పీఎమ్ రాహత్ పథకాన్ని మొదలుపెట్టడానికి ప్రధాన మంత్రి ఆమోదం తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రమాద బాధితులు రూ.1.5 లక్షల వరకూ నగదు రహిత చికిత్సను పొందగలుగుతారు. దీంతో, సత్వర వైద్య సహాయం లోపించినందువల్ల ఏ ఒక్కరూ ప్రాణం కోల్పోయే అగత్యం ఏర్పడకుండా సాయపడడమే ఈ పథకం లక్ష్యం.

లఖ్‌పతీ దీదీల లక్ష్యాన్ని రెట్టింపు చేసి 6 కోట్లకు చేర్చారు

ప్రభుత్వం 2027 మార్చి నెల నాటికి నిర్దేశించుకున్న 3 కోట్ల మంది సోదరిలను లఖ్‌పతీ దీదీ (లక్షాధికారి సోదరి)లుగా తీర్చిదిద్దాలని నిర్దేశించుకున్న చరిత్రాత్మక గణాంకాన్ని అంతకు ఒక ఏడాది కన్నా ఎక్కువ సమయం ముందే అధిగమించింది.

ప్రధానమంత్రి ఇప్పుడు ఒక కొత్త, ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించారు.. దీన్లో భాగంగా, 2029 మార్చి నెల కల్లా 6 కోట్ల మందిని లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దాలని ధ్యేయంగా పెట్టుకున్నారు. దీంతో పథకం పరిమాణాన్నీ, అభిలాషనీ రెండింతలు చేసినట్లయింది.

రైతులకు భారీ నూతనోత్తేజం: వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన నిధి రుణ లక్ష్యాన్ని రెట్టింపు చేసి రూ.2 లక్షల కోట్లకు చేర్చారు.

భారత్‌లో వ్యవసాయ రంగంలో వేల్యూ చైనును సమగ్రంగా బలోపేతం చేసే ఉద్దేశంతో వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన నిధి నుంచి రుణాలు మంజూరు లక్ష్యాన్ని రెట్టింపు చేసి, రూ.1 లక్ష కోట్ల నుంచి రూ. 2 లక్షల కోట్లకు చేర్చుతున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు.

రూ.10,000 కోట్ల మూల నిధితో 'స్టార్టప్ ఇండియా ఫండ్ 2.0'.. నూతన అన్వేషణల రంగంలో ఓ సరికొత్త మేలిమలుపు భారత్‌లో నూతన ఆవిష్కరణలకు సంబంధించిన అనుబంధ విస్తారిత వ్యవస్థకు కొత్త శక్తిని అందించడానికి.. ప్రత్యేకించి డీప్ టెక్‌కీ, ఆరంభ దశ ఆలోచనలకీ (అర్లీ స్టేజ్ ఐడియాస్), పురోగామి తయారీ రంగానికీ, బ్రేక్‌త్రూ టెక్నాలజీ రంగానికీ ఉద్దేశించిన రూ.10,000 కోట్ల మూలనిధి (కార్పస్)తో 'స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్) 2.0'ను ఏర్పాటు చేసేందుకు ప్రధానమంత్రి ఆమోదం తెలిపారు.

పరీక్షలకు వెళ్లబోయే ముందు కాలేజీలో సరస్వతీ హోమం

చల్లపల్లి, ఫిబ్రవరి 14: చల్లపల్లి విజయ క్రాంతి జూనియర్ కాలేజీలో శనివారం ఉదయం సరస్వతి హోమం నిర్వహించారు. కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షలలో అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఆరోగ్యవంతంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ కళాశాల ప్రిన్సిపాల్ దుట్టా శివరామప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, లెక్చరర్స్ తో పాటు అవనిగడ్డ ఎస్ వి ఎల్ క్రాంతి జూనియర్ కళాశాల అధినేత దుట్టా ఉమామహేశ్వరరావు చల్లపల్లి విజయ క్రాంతి జూని యర్ కాలేజీ ప్రిన్సిపాల్ దుట్టా శివరామ ప్రసాద్ ల దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలాగే కాలేజీలో చదువుకునే విద్యార్థులు సరస్వతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, చల్లపల్లి పంచాయతీ ఉపసర్పంచ్ మమ్మనేని రాజకుమార్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి క్రాంతి జూనియర్ కాలేజీలో ప్రతి సంవత్సరం విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు వెళ్లబోయే ముందు కాలేజీలో సరస్వతీ హోమంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులందరూ రాయబోయే పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలని అందరూ సంతోషంగా, ఆరోగ్యవంతంగా ఉండాలని పూజా కార్యక్రమాలు నిర్వహించటం గమనార్హం.

తొలి దళిత ముఖ్యమంత్రి..దామోదరం సంజీవయ్య

చిత్తూరు, ఫిబ్రవరి 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి, మహానేత దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా జిల్లా సాయుధ దళం కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఏ.ఆర్. డి.ఎస్‌పీ చిన్నికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డి.ఎస్‌పీ చిన్నికృష్ణ మాట్లాడుతూ 38 ఏళ్ల చిన్న వయసులోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన మహానేత దామోదరం సంజీవయ్య అని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, పేదల సంక్షేమం ఆయన పాలనకు మూల స్తంభాలని తెలిపారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేపట్టిన చర్యలు దేశ రాజకీయాల్లో చిరస్మరణీయమని కొనియాడారు.

విద్య, ఉపాధి, గ్రామీణాభివృద్ధి రంగాల్లో సంజీవయ్య గారు తీసుకున్న దూరదృష్టి నిర్ణయాలు నేటికీ ఆదర్శప్రాయంగా నిలిచాయని డి.ఎస్‌పీ తెలిపారు. సాధారణ కుటుంబం నుంచి దేశ రాజకీయాల్లో అత్యున్నత స్థానాలకు ఎదిగిన ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కృషి, పట్టుదలతో పనిచేస్తే ఎలాంటి అడ్డంకులనైనా అధిగమించి ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన జీవితం స్పష్టంగా నిరూపిస్తుందని పేర్కొన్నారు.

అలాగే పోలీసు శాఖలోని ప్రతి అధికారి, సిబ్బంది సంజీవయ్య సేవా భావనను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు న్యాయం, భద్రత అందించడంలో మరింత అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాసేవే ప్రధాన ధ్యేయంగా భావించి విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. చంద్రశేఖర్‌తో పాటు ఏ.ఆర్ సిబ్బంది పాల్గొని మహానేత దామోదరం సంజీవయ్య గారికి ఘనంగా నివాళులు అర్పించారు.

మతాలు, సంఘాలు, వ్యక్తులకు వ్యతిరేకంగా ఉండే కంటెంట్‌ను పరిమితం చేసే ప్రోగ్రామ్ కోడ్‌ను ప్రైవేట్ టీవీ ఛానెల్‌లు పాటించాలి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ (నియంత్రణ) చట్టం-1995 కింద రూపొందించిన ప్రకటనల కోడ్, ప్రోగ్రామ్ కోడ్‌లతో పాటుగా దాని కింద రూపొందించిన నియమాలకు ప్రైవేట్ శాటిలైట్ కేబుల్ టెలివిజన్ ఛానెల్‌లు కట్టుబడి ఉండాలి. మతాలు, సంఘాలపై దాడిని... మత సమూహాలను వ్యతిరేకించే దృశ్యాలు, పదాలను... సామూహిక వైఖరిని ప్రోత్సహించేవి... ఎవరైనా వ్యక్తిని గానీ, దేశంలోని సామాజిక, ప్రజా, నైతిక జీవితంలోని కొన్ని సమూహాలను గానీ వ్యక్తిగతంగా విమర్శించే, దూషించే, అపవాదులు వేసే ఏ కార్యక్రమాన్నీ ప్రసారం చేయకూడదని దీని ద్వారా నిర్దేశించారు.

కేంద్ర ప్రభుత్వం 17.06.2021 నాటి నోటిఫికేషన్ నెం. ఉ.నా.ఖీ. 416(ఇ) ద్వారా కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ (సవరణ) నియమాలు-2021ని నోటిఫై చేసింది.

తద్వారా ప్రోగ్రామ్, అడ్వర్టైజింగ్ నియమావళుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం ఒక చట్టబద్ధమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఈ నియమావళులు మూడు స్థాయిల ఫిర్యాదు పరిష్కార విధానాలను అందిస్తాయి. ప్రసారకర్త ద్వారా లెవల్ ఎ, ప్రసారకుల స్వీయ-నియంత్రణ సంస్థల ద్వారా లెవల్ ఎఎ, కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ యంత్రాంగం ద్వారా లెవల్ ఎఎఎ విధానాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వం సూచనలు, హెచ్చరికలు, క్షమాపణ స్క్రోల్ ఆర్డర్‌లు, ఆఫ్-ఎయిర్ ఆర్డర్‌లు జారీ చేయడం ద్వారా ప్రైవేట్ టీవీ ఛానెల్‌లపై చర్యలు తీసుకుంటుంది. ప్రోగ్రామ్ కోడ్‌కు కట్టుబడి ఉండటానికి మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానెల్‌లకు సూచనలనూ జారీ చేస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో జనౌషధి కేంద్రాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: జనౌషధి ఉత్పత్తుల జాబితాలో 2,110 మందులు, 315 వైద్య పరికరాలు ఉన్నాయి. దీనిలో గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, మధుమేహం, ఇన్‌ఫె క్షన్లు, అలర్జీలు, జీర్ణకోశ సమస్యల వంటి ప్రధాన చికిత్స లకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ లోని కోనసీమ జిల్లాలోని జనౌషధి కేంద్రాలు జరిపిన విక్రయాల వివరాలు అనుబంధం ఎఎలో ఉన్నాయి.

జనాభా గణాంకాలు అందుబాటులో లేనప్పటికీ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 15 లక్షల మంది వినియోగదారులు జనౌషధి కేంద్రాల నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు.

జనౌషధి కేంద్రాలలో అత్యవసర, ప్రాణరక్షక మందులతో సహా అన్ని మందుల సరఫరా క్రమం తప్పకుండా, సమర్థవంతంగా జరిగేలా చూడటానికి ఈ క్రింద చర్యలు తీసుకున్నారు:

సెప్టెంబర్ 2024 నుంచి జనౌషధి పథకంలో అత్యధికంగా అమ్ముడయ్యే 100 మందులు, మార్కెట్‌లో వేగంగా అమ్ముడయ్యే మరో 100 మందులతో కలిపి మొత్తం 200 రకాల సాధారణ మందుల నిల్వపై ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఈ విధానం ప్రకారం, ఆయా మందుల నిల్వలను తగినంతగా నిర్వహిస్తున్న కేంద్రాల యజమానులకు నెలవారీ ప్రోత్సాహకం పొందే అవకాశం కల్పించారు.

దేశవ్యాప్తంగా ఉన్న 5 గిడ్డంగులు, విస్తరిస్తున్న పంపిణీదారుల వ్యవస్థను అనుసంధానించడానికి అత్యా ధునిక సమాచార సాంకేతికతతో కూడిన సరఫరా వ్యవస్థ అందుబాటులో ఉంది.

ఈ పథకాన్ని అమలు చేసే ఫార్మాస్యూటికల్స్ అండ్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా (పీఎంబీఐ) సాధారణంగా వాడే ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా చూడటానికి, 400 వేగంగా అమ్ముడయ్యే ఉత్పత్తుల సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తోంది. వీటికి ఉండే డిమాండ్‌ను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా, కొనుగోలు ప్రక్రియను మెరుగుపరచడానికి ఈ అంచనా పద్ధతిని డిజిటలైజ్ చేయడానికి చర్యలు తీసుకున్నారు.

ఆహ్వానం
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
సౌమిత్రి పబ్లికేషన్స్, విశాఖ సంస్కృతి మానపత్రిక,
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో
విశాఖ సంస్కృతి
ప్రముఖ రచయిత
శ్రీ కూర చిదంబరం రచించిన
"సమీక్షా సౌరభాలు"
&
సమీక్షా సుమమాలిక
పుస్తకావిష్కరణ
శ్రీ కూర శంకరయ్య, శ్రీమతి లలితమ్మ స్మారక
కథా పురస్కారము-2025 ప్రదానము
తేది : 28-02-2026 శనివారం సా॥ 5-30 గం॥లకు
వేదిక : రవీంద్రభారతి సమావేశ మందిరం, మొదటి అంతస్తు, హైదరాబాద్
ముఖ్య అతిథి, అధ్యక్షత : డా॥ కె.వి.రమణాచారి గారు, ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు
సభాధ్యక్షులు : శ్రీ బైసా దేవదాసు గారు,
సంపాదకులు, నేటి నిజం దినపత్రిక
విశిష్ట అతిథి : శ్రీ ఏనుగు నర్సింహారెడ్డి గారు, ఐ.ఎ.ఎస్.
సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ
ఆత్మీయ అతిథి : శ్రీ అనుముల బాబురావు గారు, కేఫె నిలోఫర్, అధినేత
గౌరవ అతిథులు : సుప్రసిద్ధ సాహితీ వేత్తలు :
శ్రీ విహారి గారు, (జె.ఎన్.మూర్తి) ప్రముఖ రచయిత
శ్రీ సుధామ గారు, 'ఏనాటి చూడండి' వాట్సప్ ప్రసార సంచిక, వ్యవస్థాపకులు
శ్రీ సింహ ప్రసాద్ గారు, ప్రముఖ రచయిత
సమీక్షా సౌరభాలు అంకితం : కీ.శే. శ్రీ తంగిరాల చక్రవర్తి గారి దివ్యస్మృతికి
కథా పురస్కారము 2025 : ప్రథమ బహుమతి : శ్రీ రామ చంద్రమౌళి గారు - "నిర్వాణ" కథలు)
ప్రోత్సాహక బహుమతి : శ్రీమతి లలితా వర్మ గారు - "ఆణిముత్యాలు" కథలు)
సమన్వయం : శ్రీ శరేల సన్యాసిరావు గారు - సంపాదకులు, విశాఖ సంస్కృతి మానపత్రిక
శ్రీ రఘుత్రి గారు - సెక్రటరీ, మానస ఆర్ట్స్ థియేటర్స్
బండారుపల్లి రామచంద్రరావు, అధ్యక్షులు, మానస
సౌమిత్రి పబ్లికేషన్స్
శరేల సన్యాసిరావు, విశాఖ సంస్కృతి
డా॥ లలితాభాణి, కార్యదర్శి, మానస

ముమ్మరంగా జంగిల్ క్లియరెన్స్ పనులు

అమరావతి, ఫిబ్రవరి 14: కోడూరు మండల పరిధిలోని పిట్టలంక నుండి పెదకళ్ళేపల్లి దేవస్థానముకు భక్తులు భారీగా వెళ్లే మార్గంలోపిట్టలంక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. పెద్ద కల్లేపల్లి స్వామివారి దర్శనానికి కోడూరు మండలం లోని పలు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పిట్టలంక రేవు వద్దకు చేరుకుని అక్కడ నుండి పడవ మీద పెదకళ్ళేపల్లి వెళ్లి స్నానాలను ఆచరిస్తారు.

ఈ నేపథ్యంలో వేల సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా రోడ్డుకి రెండు పక్కల ఉన్న ముళ్ళపదులను ప్రత్యేకంగా జెసిబి ఏర్పాటు చేసి తొలగింపు చేశారు.

కృషి, పట్టుదలకు ప్రతీక దామోదరం సంజీవయ్య

-కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఫిబ్రవరి 14: దామోదరం సంజీవయ్య కృషి, పట్టుదలకు ప్రతీక అని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో కలిసి మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్, సంజీవయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశ రాజకీయ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన మహానేత అని పేర్కొన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించి, కృషి, పట్టుదలతో రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగి సామాజిక న్యాయం కోసం పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందారని చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉన్నత విద్యను అభ్యసించారని అన్నారు. భారత స్వాతంత్ర్య సమరంలో చురుకైన పాత్ర పోషించి, దేశ స్వేచ్ఛ కోసం జరిగిన ఉద్యమాలలో పాల్గొని జాతీయ చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించేందుకు కృషి చేశారని ప్రశంసించారు. ప్రజా సేవ లక్ష్యంగా జీవించారని అన్నారు. మంచి వనితనం, నిజాయితీ, ప్రజల పట్ల అంకితభావంతో ఎల్లప్పుడూ కొనసాగారని తెలిపారు. ముఖ్య మంత్రిగా పేదల సంక్షేమం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, కార్మికుల సంక్షేమం, పరిపాలనలో పారదర్శకత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. సమాజంలోని అణగారిన వర్గాల అభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేశారన్నారు.

దామోదరం సంజీవయ్య చేసిన సేవలు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచాయని, ఆయన నుండి ప్రతీ ఒక్కరూ ముఖ్యంగా యువత ఎంతో స్ఫూర్తిని పొందాలని సూచించారు. సంజీవయ్య అడుగుజాడలు యువతకు మార్గదర్శకం అన్నారు.

బ్రహ్మపుత్ర నది మీద నిర్మించిన కుమార్ భాస్కర్ వర్మ సేతును ప్రారంభించిన ప్రధాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2026 ఫిబ్రవరి 14న అస్సాంలో పర్యటిస్తారు. ఉదయం సుమారు 10:30 గంటల వేళలో, ప్రధాన మంత్రి డిబ్రూగఢ్‌లోని మొరాన్ బైపాస్ ప్రాంతంలోని ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్ఎఫ్)లో విమానం నుంచి నేల మీదికి దిగుతారు. అక్కడ పోరాట విమానాలు, రవాణా విమానాలతో పాటు హెలికాప్టర్ల గగనతల విన్యాసాల్ని ఆయన వీక్షిస్తారు. బ్రహ్మపుత్ర నదిపై నిర్మాణం పూర్తి అయిన కుమార్ భాస్కర్ వర్మ సేతును మధ్యాహ్నం దాదాపు ఒంటిగంట వేళలో ప్రధానమంత్రి సందర్శిస్తారు. ఆ తరువాత, గువాహాటీలోని లచిత్ ఘాట్ వద్ద వివిధ పథకాలను మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ పథకాలకు రూ.5,450 కోట్లకు పైగా మొత్తాన్ని ఖర్చు చేశారు.

అత్యవసర ల్యాండింగ్ కేంద్రం (ఈఎల్ఎఫ్) ఈశాన్య భారతంలో మొదటిది. ఎమర్జెన్సీలలో సైనిక విమానాలు, పౌర విమానాలు నేల మీదకు దిగడానికీ, నేల మీది నుంచి నింగి లోకి ఎగుండానికీ అనుకూలంగా దీనిని భారత వాయు సేన సమన్వయంతో నిర్మించారు. ఇది అత్యవసర వేళల్లో తగిన ప్రతిస్పందనపూర్వక చర్యలను చేపట్టడంలో కీలక పాత్రను పోషిస్తుంది. ఈశాన్య ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయాల్లో సహాయక, రక్షణ కార్యకలాపాలను వెనువెంటనే మొదలుపెట్టడానికి గాని, లేదా ఆ ప్రాంతాల్లో వ్యూహాత్మక అవసరాల్ని తీర్చడానికి గానీ ఇది తోడ్పడుతుంది. రెండు రకాలుగా ఉపయోగించుకొనేటట్లు ఈ మౌలిక సదుపాయాన్ని తీర్చిదిద్దారు. 40 టన్నుల వరకూ ఉండే పోరాట విమానానికి అనుకూలంగా ఉండడంతో పాటు, గరిష్ఠంగా 74 టన్నుల వరకూ బరువు గల సామగ్రిని నింపిన రవాణా విమానం కూడా ఈఎల్ఎఫ్ నుంచి నింగికి ఎగురగలుగుతాయి.

అనేక ముఖ్య ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. వాటిలో రవాణా సేవలను వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టులూ, డిజిటల్ సేవలను పటిష్ఠపరిచేవీ, ఉన్నత విద్యను ప్రోత్సహించేవీ, సార్వజనిక రవాణాను పెంపొందించేవీ ఉన్నాయి.

ఫలితంగా ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి గొప్ప ఊతం లభించనుంది.

సుమారు రూ.3,030 కోట్ల ఖర్చుతో బ్రహ్మపుత్ర నది మీద నిర్మించిన కుమార్ భాస్కర్ వర్మ సేతును ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఆరు వరసలుగా, ప్రీస్ట్రెస్డ్ కాంక్రీట్ (పీఎస్‌సీ)తో నిర్మించిన ఈ వంతెన గువాహాటీని ఉత్తర గువాహాటీతో కలుపుతుంది. ఈశాన్య భారతంలో అసాధారణ వోతాదులో పీఎన్‌సీని ఉపయోగించి నిర్మించిన మొదటి వంతెన ఇదే. ఈ వారధి గువాహాటీ, ఉత్తర గువాహాటీల మధ్య ప్రయాణించడానికి పట్టే కాలాన్ని ఏడు నిమిషాలకు తగ్గిస్తుంది. ఈ ప్రాంతంలో భూ కంపాలు తరచుగా నమోదు అవుతుండడాన్ని లెక్కలోకి తీసుకొని, ఈ వంతెనను నిర్మించడంలో మన్నిక నిర్ధారణకు గాను బేస్ ఐసోలేషన్ సాంకేతికతనీ, రాపిడికి తట్టుకొని నిలిచే బేరింగులనీ ఉపయోగించారు. వాస్తవ కాల స్థితి పర్యవేక్షణ, నష్టాన్ని త్వరిత గతిన గుర్తించడంతో పాటు వంతెన సురక్షనీ, వంతెన సేవల వ్యవధినీ మెరుగుపరచడం కోసం బ్రిడ్జి హెల్త్ మానిటరింగ్ సిస్టమ్ (బీహెచ్ఎంఎస్)ను కూడా సమకూర్చారు.

దేశ ఈశాన్య ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని అస్సాంలోని కామరూప్ జిల్లా అమిన్‌గావ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ డేటా సెంటరును ప్రధానమంత్రి ప్రారంభిస్తారు.

ఈ అత్యంత ఆధునిక డేటా సెంటరు మొత్తం 8.5 ఎండబ్ల్యూ లోడుతో సగటున ఒక్కో ర్యాకుకూ 10 కేడబ్ల్యూ సామర్థ్యంతో పనిచేస్తుంది. ప్రభుత్వ వివిధ విభాగాలకు కీలక సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఇతర జాతీయ డేటా సెంటర్లకు డిజాస్టర్ రికవరీ సెంటరుగా ఉంటుంది. ఇది ఈశాన్య ప్రాంతాల్లో అతి ముఖ్య పౌర ప్రధాన సేవల్ని డిజిటల్ మాధ్యమం ద్వారా అందజేయడంలో ప్రభుత్వాలకు సహాయపడుతుంది. నార్త్ ఈస్టర్న్ రీజియన్ నేషనల్ డేటా సెంటరును డిజిటల్ ఇండియా దృష్టికోణానికి అనుగుణంగా ఉండేలాగానూ, ఆ ప్రాంతాల్లో ఐసీటీ వ్యవస్థను బలోపేతం చేసి, డిజిటల్ మాధ్యమం ద్వారా పటిష్ట, సురక్షిత, సర్వ కాలిక సేవల లభ్యతకు పూచీ పడే లక్ష్యంతోనూ దీనిని రూపొందించారు. ఐఐఎం- గువాహాటీని కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. దేశ ఈశాన్య ప్రాంతాల్లో ఉన్నత విద్యకీ, మేనేజ్మెంట్ విద్యకీ వెన్నుదన్నుగా ఐఐటీ గువాహాటీ నిలుస్తుంది.

'పీఎమ్-ఈబస్ సేవా పథకం'లో భాగంగా 225 విద్యుత్తు బస్సులను కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. వీటిలో గువాహాటీకి చెందిన 100 బస్సులు, నాగ్‌పూర్‌కు, భావ్‌నగర్‌కు చెందిన చెరి 50 బస్సులతో పాటు చండీగఢ్‌కు చెందిన 25 బస్సులు ఉన్నాయి. ఈ నాలుగు నగరాల్లో విద్యుత్తు బస్సుల సేవలను మొదలుపెడు తుండడంతో, 50 లక్షల కన్నా ఎక్కువ మంది పౌరులకు స్వచ్ఛమైన, చౌకైన, విశ్వసనీయమైన సార్వజనిక రవాణా నదుపాయం అందుబాటులోకి రానుంది. ఈ ఎలక్ట్రిక్ బస్సులు నగర ప్రాంతాల్లో గతిశీలతనీ, జీవన నాణ్యతనీ మెరుగుపరచడంలో కూడా తోడ్పడుతాయి.

వైద్య విద్యపై తాజా సమాచారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అందించిన సమాచారం ప్రకారం విద్యా సంవత్సరం 2020-21 నుంచి 2025-26 నాటికి ఎంబీబీఎస్ సీట్లు 48,563, పీజీ సీట్లు 29,080 వరకూ పెరిగాయి. పెరిగిన ఎంబీబీఎస్, పీజీ సీట్ల వివరాలు అనుబంధంలో ఉన్నాయి. అంతేకాకుండా, ఆర్థిక సంవత్సరం 2025-26 నుంచి 2028-29 వరకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల పరిధిలో ప్రభుత్వ కళాశాలల్లో 10,023 అదనపు సీట్లను చేర్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

వైద్యవిద్యలో పెరిగిన సీట్లు ప్రధానంగా వైద్య సేవలు అందని ప్రాంతాల్లో ఆరోగ్య రంగ నిపుణుల కొరతను తగ్గిస్తాయి. అలాగే రాష్ట్రాల్లో డాక్టర్-జనాభా నిష్పత్తిపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపిస్తాయి. మౌలిక వసతులు, బోధనా సిబ్బంది పెంపు, వైద్య విద్య సీట్ల పెరుగుదలతో దేశీయ సంస్థలు భారతీయ విద్యార్థులకు మరింతగా అందుబాటులోకి వస్తాయి.

వైద్య విద్య నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించే ఉన్నత స్థాయి సంస్థ ఎన్ఎంసీ కీలక నియంత్రణలను జారీ చేసింది. వీటిలో కనీస ప్రమాణాల అవసరాలు (ఎంఎస్ఆర్), పట్టభద్ర వైద్య విద్య నియంత్రణలు (జీఎంఈఆర్)-2023, వైద్య విద్య ప్రమాణాల నిర్వహణ నియంత్రణలు-2023 (ఎంఎస్ ఎంఈఆర్-2023), సామర్థ్య ఆధారిత వైద్య విద్య (సీబీఎంఈ) బోధనా మార్గదర్శకాలు-2024 తదితరమైనవి ఉన్నాయి. ఇవి వైద్య విద్యలో నిర్దేశిత ప్రమాణాలు అమలుకు భరోసానిస్తాయి. దేశవ్యాప్తంగా వైద్య విద్య, శిక్షణ సమగ్రతను, నాణ్యతను కొనసాగించేందుకు ఈ నిబంధనలను రూపొందించారు.

దేశవ్యాప్త రోగనిరోధక టీకా కార్యక్రమంపై తాజా సమాచారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: 11.12 కోట్ల మంది పిల్లలు, 3.78 కోట్ల మంది గర్భిణీలు 2026 ఫిబ్రవరి 8 నాటికి యు-విన్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

ప్రతి టీకా కార్యక్రమం తరువాత లబ్ధిదారులు యు-విన్ పోర్టల్ నుంచి క్యూఆర్ కోడ్ ఆధారిత వ్యాక్సినేషన్ ధ్రువీకరణ పత్రాన్ని స్వయంగా తీసుకోవచ్చు. కేవలం 2025లోనే 8.01 కోట్ల మంది లబ్ధిదారులు ఈ పోర్టల్‌లో నమోదయ్యారు. వారికి డిజిటల్ ధ్రువీకరణ పత్రాలను అందుబాటులో ఉంచారు.

2025లో దేశవ్యాప్తంగా లబ్ధిదారులకు యు-విన్ పోర్టల్ నుంచి మొత్తం 29.42 కోట్ల సంక్షిప్త సందేశాలను పంపించారు. టీకాలు వేయించుకోవాల్సిన పిల్లల జాబితాను రూపొందించడంలో యు-విన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ పిల్లలను పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా వారికి వేయాల్సిన డోసుల గురించి సంక్షిప్త సందేశాలను పంపడం ద్వారా క్రమ తప్పకుండా వారిని చైతన్యవంతం చేయడడం సాధ్యమవుతోంది. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది గుర్తించిన పిల్లలకు తగిన సమయంలో టీకాలు వేయడం, వివరాలను క్రమం తప్పకుండా యు-విన్ వేదికలో నమోదు చేయడం ద్వారా పిల్లలకు పూర్తిస్థాయిలో వ్యాధి నిరోధక శక్తిని అందిస్తున్నారు.

ఆరోగ్య సేవల నాణ్యతను పెంచడానికి యు-విన్ పోర్టల్‌ను ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్, పోషణ్ ట్రాకర్, సేఫ్ వాక్ ఆన్‌లైన్ వేదికలతో అనుసంధానించారు.

ఈ సమాచారాన్ని కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియ పటేల్ నేడు లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

సామూహిక వివాహాలకు అభిమన్యు గ్రూప్ సరుకుల విరాళం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14: కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు) మండలంలోని మహాగం గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివాసీ సమాజంలో తక్కువ ఖర్చుతో పేద కుటుంబాలకు సంత్ శ్రీసురోజి బాబా ఆశ్రమంలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 16న 25 పేదకుటుంభలకు సామూహిక వివాహాలకు అభిమన్యు గ్రూప్ తరుపున నిధులు జమ చేసి వచ్చే భక్తులకు అన్నదానం కార్యక్రమం కొరకు నిత్యావసర వస్తువులు సామూహిక వివాహాల కమిటీ సభ్యులకు అందజేశారు. అభిమన్యు గ్రూప్ సభ్యులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాత్ రావు మాట్లాడుతూ మహాగాంలో శ్రీ సూరజ్ బాబా ఆశ్రమంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రతి ఏడాది శివరాత్రి సందర్భంగా సామూహిక వివాహాలు నిర్వహించడం అర్హనీయమన్నారు.

నిరుపేద జంటలకు సామూహిక వివరాలు జరపడం వల్ల వారు ఆర్థిక పరిస్థితిని చూసి అభిమన్యు గ్రూపు టీం నిర్వాకులు మెస్రం శేఖర్ బాబు, సభ్యులకు ఆయనతోపాటు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంచి కార్యక్రమాలకు దాతలు ముందకు రావడం సంతోషకరమని తక్కువ ఖర్చుతో నిరుపేదల వ్యూహాలు ప్రతి ఏడాది ఆశ్రమంలో జరగడం ఆశ్రమ కమిటీ వివాహకులు ప్రతి ఏడాది సామూహిక వివాహాలు జరపడం ఎంతో సంతోషకరమని ఆదర్శనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహాగం సర్పంచ్ జానే రావు, అభూమాన్యు టీం నిర్వహికుడు మెస్రం శేఖర్ బాబు, ఉపాధ్యాయులు లింగు, దత్తు, దేవ్ రావు, బ0డు, కాంగ్రెస్ యువ నాయకులు మెస్రం అంబాజి రావు, సర్ మెడి ఆనంద్ రావు, నాయకులు కమిటీ సభ్యులు నీతారాం, కృష్ణ మూర్తి,యాదవ్ రావు, మండల సర్పంచులు నగేష్, భూపతి, ఉయిక చందన్ షావ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళులు..

చిత్తూరు, ఫిబ్రవరి 14: దేశం గర్వించ తగిన మహనీయుడు, సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు దామోదరం సంజీవయ్య అని జాయింట్ కలెక్టర్ ఏ. రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం చిత్తూరు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు దామోదరం సంజీవయ్య గారి 105వ జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్ కుమార్, ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నం యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మారుమూల ప్రాంతంలో సాధారణ కుటుంబంలో జన్మించి తన కృషి, పట్టుదలతో అత్యున్నత స్థానాలకు ఎదిగిన మహనీయుడు దామోదరం సంజీవయ్య అని కొనియాడారు. ఆయన చరిత్ర ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తుందని, కష్టసాధ్య పరిస్థితులను జయించి ప్రజాసేవలో అగ్రగామిగా నిలిచిన నాయకుడిగా సంజీవయ్య పేరు చిరస్థాయిగా నిలిచిందన్నారు.

ఫిబ్రవరి 14, 1921న జన్మించిన దామోదరం సంజీవయ్య 1960 జనవరి 11 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా సేవలందించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దేశ చరిత్రలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆయన సాధించిన ఘనత విశిష్టమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన అమలు చేసిన అనేక సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. ఆయన చేసిన సేవలు ఒక్క తరం లేదా రెండు తరాలకు మాత్రమే పరిమితం కాకుండా తరతరాలకు ప్రయోజనం చేకూరే విధంగా పునాదులు వేసిన నాయకుడని జాయింట్ కలెక్టర్ అభిప్రాయపడ్డారు.

దేశం మరియు రాష్ట్ర అభివృద్ధికి సంజీవయ్య గారు చేసిన విశేష సేవలను ఈ సందర్భంగా అధికారులు స్మరించుకున్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. అనేక రంగాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు, ప్రవేశపెట్టిన సంస్కరణలు నేటికీ ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు.

అనంతరం డిఆర్ఓ మోహన్ కుమార్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య గారి సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. భారత రాజకీయాల్లో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానేతగా ఆయన నిలిచారని పేర్కొన్నారు. సాధారణ నేపథ్యం నుంచి దేశ రాజకీయాల్లో అత్యున్నత స్థానాలకు ఎదిగిన సంజీవయ్య గారు క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనమని తెలిపారు. ప్రతి యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

సామాజిక సమానత్వం మరియు పేదల అభ్యున్నతే లక్ష్యంగా సంజీవయ్య గారు చేపట్టిన సంస్కరణలను ఈ సందర్భంగా వక్తలు ప్రస్తావించారు. 1960ల దశకంలో భూమి యాజమాన్యమే ఆర్థిక భద్రతకు మూలమని గుర్తించి భూ సంస్కరణల చట్టాన్ని అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అధిక భూములను పేదలకు పంపిణీ చేసే విధంగా ఈ చట్టం రూపుదిద్దుకోవడం దామోదరం సంజీవయ్యకి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమం గౌరవప్రద వాతావరణంలో నిర్వహించారు.

రహదారుల ఆక్రమణలు సహించం..

-ఆక్రమణల దారులను హెచ్చరిస్తున్న సిఐ కిషోర్ బాబు

-రహదారుల ఆక్రమణలపై సిఐ కిషోర్ బాబు కఠిన హెచ్చరిక..

-స్వచ్ఛందంగా తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం..

-ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక..

-ప్రజల సౌకర్యం కోసం కఠిన చర్యలకు వెనుకాడబోమని స్పష్టం..

విజయవాడ , ఫిబ్రవరి 14: విజయవాడ సత్యనారాయణపురంలోని త్రీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారుల ఆక్రమణలపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు తెలిపారు. ఎన్.ఆర్.పి రోడ్డులోని శారద కాలేజ్ జంక్షన్ నుంచి ఐరాక్స్ థియేటర్ వరకు కొంతమంది వ్యాపారస్తులు రోడ్లను ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు, వాహనాల సాఫీ ప్రయాణానికి ఎటువంటి ఆటంకం కలగకుండా రహదారులపై ఆక్రమణలు సంబంధిత వ్యాపారస్తులకు స్వచ్ఛందంగా వెంటనే ఆక్రమణలు తొలగించుకోవాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటాం'' అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ జీవీఎన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

బూటక.. అవాస్తవ.. తప్పుదోవ పట్టించే సమాచారంతో పెరుగుతున్న ముప్పును ప్రభుత్వం గుర్తించింది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: దేశ పౌరులందరికీ వాక్ స్వాతంత్ర్యంపై రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 హామీ ఇస్తోంది. అయితే, డిజిటల్ వేదికలపై బూటక.. అవాస్తవ.. తప్పుదోవ పట్టించే సమాచారంతో పెరుగుతున్న ముప్పు ఎలాంటిదో ప్రభుత్వానికి తెలుసు.

అందుకే, ''ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000 కింద ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు-డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నిబంధనలు-2021 జారీ చేసింది. ఇందులో భాగమైన పార్ట్-ఎఎఎ నిబంధనలు 'ఆన్‌లైన్ క్యూరేటెడ్ కంటెంట్' (ఆఖ వేదికలు) ప్రచురణకర్తలకు వర్తిస్తుంది. ప్రస్తుతం అమలులోగల చట్టం కింద నిషేధిత కంటెంట్‌ను ప్రచుర ణకర్తలు ప్రసారం, ప్రచురణ చేయరాదని ఈ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

నిబంధనల షెడ్యూల్‌లోని సార్వత్రిక మార్గదర్శకాల ప్రాతిపదికన కంటెంట్‌ను వయో ఆధారిత వర్గీకరణ కింద 5 విభాగాలుగా విభజించాలి. దీని ప్రకారం ఓటీటీ వేదికలు బాలల వయసుకు తగని కంటెంట్‌ను పరిమితం చేస్తూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని చట్టం నిర్దేశిస్తోంది. అలాగే ఇతరత్రా అంశాలు సహా వార్తలు-తాజా సమాచార ప్రచురణకర్తలు పాటించాల్సిన నైతిక నియమావళిని కూడా నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మేరకు కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ చట్టం-1995 కింద నిర్దేశించిన ప్రోగ్రామ్ నిబంధనలకు, ప్రెస్ కౌన్సిల్ చట్టం-1978 కింద పాత్రికేయ ప్రవర్తన నియమావళికి కట్టుబడాల్సి ఉంటుంది. వీటి ప్రకారం బూటకపు, అవాస్తవ, తప్పుదోవ పట్టించే, అర్ధసత్యాలతో కూడిన సమాచారాన్ని ప్రచురణకర్తలు వ్యాప్తి చేయరాదని సదరు నిబంధనలు, నియమావళి స్పష్టీకరిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన బూటకపు వార్తలను తనిఖీ నిమిత్తం సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని పాత్రికేయ సమాచార సంస్థ (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) కింద 2019 నవంబరులో ఒక 'నిజనిర్ధారణ వ్యవస్థ' ఏర్పాటైంది. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల అధీకృత వనరుల ద్వారా వార్తల ప్రామాణికతను ధ్రువీకరించుకున్న తర్వాత ఈ వ్యవస్థ తన సామాజిక మాధ్యమ వేదికలలో వాస్తవ సమాచారాన్ని వెల్లడిస్తుంది.

ప్రైవేట్ ఉపగ్రహ టీవీ ఛానెళ్ల ప్రసారం చేసే కార్యక్రమాలు, ప్రకటనలన్నీ 'కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ (నియంత్రణ) చట్టం -1995 కింద రూపొందించిన 'కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ రూల్స్-1994 నిర్దేశిత ప్రోగ్రామ్ కోడ్, అడ్వర్టైజింగ్ కోడ్‌లకు కట్టుబడి ఉండాలి.

సదరు టీవీ ఛానెళ్ల కంటెంట్ నియంత్రణకు ఈ నిబంధనలలో విస్తృత శ్రేణి పారామితులు నిర్దేశితమ య్యా యి. అశ్లీల, అప్రతిష్టకర, ఉద్దేశపూర్వక బూటకపు, సంకేతాత్మక అవాస్తవాలు, అర్ధ సత్యాలతో కూడిన ఎలాంటి కార్యక్రమాన్నీ ప్రసారం చేయరాదని ప్రోగ్రామ్ కోడ్ స్పష్టం చేస్తోంది.

రాజ్యసభలో బీజేపీ సభ్యుడు శ్రీ తేజ్‌వీర్ సింగ్ ప్రశ్నకు సమాధానంగా సమాచార-ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖల సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ ఈ సమాచారాన్ని వెల్లడించారు.

'మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ పీఠం బీసీ మహిళకు కేటాయించాలి'

మిర్యాలగూడ ఫిబ్రవరి 14 : మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ పీఠం బీసీ మహిళలకు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు శనివారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ జనరల్ మహిళకు రిజర్వేషన్ అయినందున జనరల్ స్థానంలో బీసీ మహిళకు కేటాయించి బీసీలకు న్యాయం చేయాలని, గతంలో కూడా జనరల్ స్థానంలో అగ్రవర్ణాలకే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ రెండింటిని కేటాయించి బీసీలను మోసం చేశారన్నారు. కావున జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు న్యాయం జరగాలంటే బీసీలకే మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. మిర్యాలగూడ మున్సిపల్ పరిధిలో 48 వార్డుల్లో సగానికి పైగా బీసీలు గెలుపొందారని, కావున జనాభా దామాషా ప్రకారం బీసీలకు మున్సిపల్ చైర్మన్ ఇవ్వాల్సిందేనన్నారు.

గత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బీసీలకు చైర్మన్ అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని ఇప్పుడు నిలబెట్టుకోవాలన్నారు. నలగొండ జిల్లాలో కేవలం ఒకే సామాజిక వర్గానికి చెందినవారు అన్ని పదవులు ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి పదవులు అనుభవిస్తున్నారని కనీసం చైర్మన్ లాంటి పదవులు అయినా బీసీలకు ఇచ్చి సామాజిక న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్, యువజన నాయకులు ఎస్పీ నాయుడు, రామకృష్ణ, నరేష్, రోహిత్, రవి, గోపాల్, వెంకటేష్, లవన్, క్రాంతి, శేఖర్, రమేష్, రాములు, సురేందర్, లక్ష్మి, సుధా, అనురాధ, జ్యోతి, శ్వేత, రాధా, మహేశ్వరి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యకి గౌరవ డాక్టరేట్

ఖమ్మం, ఫిబ్రవరి 14: ఆదివాసి ముద్దుబిడ్డ, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యకు గౌరవ డాక్టరేట్ లభించింది. శనివారం చెన్నై, వైలాపూర్ భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఎలాంటి అవినీతికి తావు లేకుండా, నిబద్ధతైన సేవలు అందించినందుకు గాను యూనివర్సిటీ కమిటీ గుమ్మడి నరసయ్యను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు సత్కరిస్తున్నట్లు పేర్కొంది. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డా.గౌని నర్సింహ గౌడ్, నామినేషన్ కమిటీ మెంబర్ ఎండీ.అరిఫుద్దీన్ చేతుల మీదుగా గుమ్మడి నరసయ్య ఈ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఇల్లెందుకు చెందిన పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణకు అలవర్చుకోవాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 14: విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని శ్రీవాణి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని నర్సాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని విజయ గార్డెన్లో శనివారం సుల్తానాబాద్ శ్రీవాణి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి శశాంక ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతీ ఒక్క విద్యార్థి అంకితభావంతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని అల్లరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రేకుల పల్లి సుష్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలసాని శ్రీనివాస్, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ బండారి కమలాకర్, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

రాగినేడులో మహాశివరాత్రికి ముస్తాబైన శ్రీ నాగలింగేశ్వర స్వామి దేవస్థానం

కరీంనగర్, జఫిబ్రవరి 14: పెద్దపల్లి మండలం రాగినేడులో వెలసిన స్వయంభూ నాగలింగేశ్వర స్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దేవాలయంలో మహా శివరాత్రి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా నేతృత్వంలో అత్యంత వైభవంగా నిర్మించబడ్డ శ్రీ నాగ లింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 15 ఆదివారం నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబ చేశారు. మహాశివరాత్రి పర్వదినం రోజున తెల్లవారు జామున 3.45 కు స్వామివారికి మహా రుద్రాభిషేకం, 12 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం, సాయంకాలం 4 గంటలకు శివపార్వతుల శోభాయాత్ర, రాత్రి పది గంటల నుంచి 12 గంటల వరకు స్వయంభు నాగలింగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం, బిల్వార్చన, లింగోద్భవ కాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు.

పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలోని శ్రీ స్వయంభూ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుటకు గాను సకల సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోతురాజుల భూమయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గుమ్మడి విజయ్, సర్పంచ్ సోమ కుమార్ లు తెలిపారు.

మహాశివరాత్రిని పురస్కరించుకొని దేవాలయంలో రెండు రోజులపాటు జరిగే పూజా కార్యక్రమాలలో ఆలయ నిర్మాణ కర్త, తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా వారి సోదరులు కోలేటి శ్రీనివాస్ లు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా భక్తులకు అన్ని సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. రాగినేడు గ్రామప్రజలతో పాటు చుట్టుపక్కల ఉన్నటువంటి సమస్త గ్రామ ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఆ ముక్కంటి ఆశీస్సులను అందుకోవాలని వాళ్లు విజ్ఞప్తి చేశారు.

ఈ టికెటింగ్ వ్యవస్థ సమగ్రతను కాపాడటానికి చివరి ఆరు నెలల్లో 60.43 బిలియన్ హానికరమైన బాట్ అభ్యర్థనల నిలిపివేత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: భారతీయ రైల్వే రిజర్వేషన్ టికెట్ బుకింగ్ వ్యవస్థ పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా అత్యాధునిక సైబర్ భద్రతా నియంత్రణలతో కూడిన అత్యంత పటిష్టమైన, సురక్షితమైన ఐటీ వేదిక. హ్యాకింగ్ సాధనాల ద్వారా ఫారమ్‌లను స్వయంచాలకంగా నింపకుండా అరికట్టడానికి, ఇంటర్నెట్ ద్వారా తత్కాల్ టికెట్ బుకింగ్‌లో జరిగే మోసాలను నిరోధించడానికి, సైబర్ దాడుల నుండి వ్యవస్థను రక్షించడానికి భారతీయ రైల్వే ఈ కింది చర్యలు చేపట్టింది.

తత్కాల్ టికెట్ల బుకింగ్ కోసం ఆధార్ ధ్రువీకరణ- తత్కాల్ బుకింగ్‌లో దుర్వినియోగాన్ని అరికట్టడానికి పారదర్శకతను పెంచడానికి ఆన్‌లైన్ తత్కాల్ టికెట్ బుకింగ్ కోసం ఆధార్ ఆధారిత వన్-టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) ధ్రువీకరణ ప్రవేశపెట్టారు. తత్కాల్ బుకింగ్ అనేది సమయంతో కూడుకున్న ప్రక్రియ. ఆధార్ ధ్రువీకరణ ద్వారా సదరు వినియోగదారు అసలైన వ్యక్తి కాదా అనేది తక్షణమే నిర్ధారణ అవుతుంది. ఒక వ్యక్తికి ఒకే ఆధార్ ఉండటం వల్ల నకిలీ లేదా అనధికారిక ఏజెంట్ల నియంత్రణలో ఉండే బహుళ వినియోగారు అకౌంట్ల సృష్టిని ఇది సమర్థవంతంగా అడ్డుకుంటుంది. అకౌంట్ల సంఖ్యను పెంచి సాఫ్ట్‌వేర్ల ద్వారా టికెట్లు కొల్లగొట్టే విధానానికి ఇది ఒక బలమైన రక్షణ కవచంలా పనిచేస్తుంది. దీనివల్ల తత్కాల్ టికెట్లు నిజమైన ప్రయాణికులకు న్యాయంగా కేటాయింపు జరుగుతుంది. ఈ విధానం వల్ల నిజమైన ప్రయాణికులకు టికెట్ల లభ్యత పెరగడమే కాకుండా, ఆన్‌లైన్ తత్కాల్ బుకింగ్ వ్యవస్థలో పారదర్శకత పెంపొందించడానికి దోహదపడింది.

అప్లికేషన్ లేయర్ భద్రతా కంట్రోల్- స్క్రిప్టింగ్, బ్రూట్-ఫోర్స్ దాడులు, డిడోస్ (డిస్ట్రిబ్యూటెడ్ డెనియల్ ఆఫ్ సర్వీస్) దాడులను నివారించడానికి వివిధ స్థాయిల్లో క్యాప్చా (కంప్లీట్లీ ఆటోమేటెడ్ పబ్లిక్ ట్యూరింగ్ టెస్ట్ టు టెల్ కంప్యూటర్స్ అండ్ హ్యూమన్ అపార్ట్) విధానంతో సహా పలు అప్లికేషన్ స్థాయి భద్రతా నియంత్రణలను అమలు చేస్తున్నారు.

అప్లికేషన్ భద్రతలో ఉండే లోపాలను సరిదిద్దడానికి ఓడబ్ల్యూఎస్ పీ (ఓపెన్ వెబ్ అప్లికేషన్ సెక్యూరిటీ ప్రాజెక్ట్) సూచించిన అనేక భద్రతా చర్యలను కూడా చేపట్టారు.

వ్యవస్థ పనితీరును మెరుగు పరచడానికి, ఇంటర్నెట్ టికెట్ బుకింగ్ వెబ్‌సైట్‌పై నేరుగా పడే ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడానికి భారతీయ రైల్వే కంటెంట్ డెలివరీ నెట్‌వర్క్ (సీడీఎన్)ను ఏర్పాటు చేసింది. ఇది స్థిరమైన సమాచారాన్ని వేగంగా లోడ్ చేయడంలో సహాయపడుతుంది. వెబ్‌సైట్‌పై జరిగే హానికరమైన లేదా అనుమానాస్పద ప్రయత్నాలను అడ్డుకోవడానికి ఏకేఏఎంఏఐ వంటి అత్యాధునిక యాంటీ-బోట్ పరిష్కారాలను అమలు చేశారు. ఇవి అసలైన వినియోగదారులు కాని వారిని తొలగించడం ద్వారా నిజమైన ప్రయాణికులు ఎటువంటి ఆటంకం లేకుండా టికెట్లు బుక్ చేసుకోవడానికి దోహదపడతాయి. ఇది హానికరమైన ట్రాఫిక్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది.

సైబర్ బెదిరింపుల నుంచి వ్యవస్థను కాపాడటానికి నెట్‌వర్క్ ఫైర్‌వాల్‌లు, చొరబాటు నివారణ వ్యవస్థలు, అప్లికేషన్ డెలివరీ కంట్రోలర్లు, వెబ్ అప్లికేషన్ ఫైర్‌వాల్ వంటి బహుళ రక్షణ కవచాలను ఉపయోగిస్తున్నారు.

నెట్‌వర్క్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేయర్ సెక్యూరిటీ కంట్రోల్స్- వైఫల్యాలను తగ్గించడానికి మొత్తం ఐసీటీ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కమ్యూనికేషన్ టెక్నాలజీస్) మౌలిక సదుపాయాలను హై అవైలబిలిటీ సాంకేతికతతో ఏర్పాటు చేశారు.

ఈ వ్యవస్థను పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా ఉండే అత్యంత ఆధునిక డేటా సెంటర్ గ్రేడ్ నెట్‌వర్క్, నెట్‌వర్క్ ఫైర్‌వాల్స్, నెట్‌వర్క్ ఇంట్రూషన్ ప్రివెన్షన్ సిస్టమ్స్, అప్లికేషన్ డెలివరీ కంట్రోలర్స్, వెబ్ అప్లికేషన్ ఫైర్‌వాల్ వంటి పరికరాలతో రక్షిస్తున్నారు.

భారీ స్థాయిలో జరిగే డీడీఓఎస్ దాడుల నుంచి రక్షించేందుకు ఐఎస్ పీ (ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్) స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. అనేక ఐఎస్ పీల ద్వారా డీడీఓఎస్ గుర్తింపు, నివారణ సేవలు అమలవుతున్నాయి. దాదాపు 30 జీబీపీఎస్ సామర్థ్యంతో డీడీఓఎస్ నివారణ వ్యవస్థ సిద్ధంగా ఉంచారు.

భద్రతను పెంచడానికి, వెబ్ ట్రాఫిక్ లోడ్‌ను తగ్గించడానికి, త్వరితగతిన సేవలు అందించడానికి ఎంటర్‌ప్రైజ్ స్థాయి కంటెంట్ డెలివరీ నెట్‌వర్క్ (సీడీఎన్), యాంటీ-బాట్, సురక్షిత డీఎన్ఎస్, వెబ్ అప్లికేషన్ ఫైర్‌వాల్ (డబ్ల్యూఏఎఫ్) సేవలను అమలు చేశారు.

సమగ్ర సైబర్ దాడులను ఎదుర్కోవడానికి రైల్‌టెల్ సంస్థ ద్వారా డీప్-డార్క్ వెబ్ మానిటరింగ్, డిజిటల్ రిస్క్ ప్రొటెక్షన్, సంఘటనలపై వేగవంతమైన స్పందనను మెరుగుపరిచే చర్యలను చేపట్టారు.

భౌతిక భద్రతా నియంత్రణలు-ఈ వ్యవస్థను న్యూఢిల్లీలోని చాణక్యపురి ప్రాంతంలో ఉన్న ఒక ప్రత్యేక సురక్షిత డేటా సెంటర్ లో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రం నిరంతరం సీసీటీవీ నిఘాలో ఉండటమే కాకుండా.. అనుమతి ఉన్న వారికి మాత్రమే లోపలికి ప్రవేశం ఉండేలా కఠినమైన నియంత్రణలు ఉన్నాయి. ఈ డేటా సెంటర్ ఐఎస్ఓ 27001 (ఐఎస్ఎంఎస్) ధ్రువీకరణ పొందింది.

భద్రతా ఆడిట్, పర్యవేక్షణ- భద్రతాపరమైన సంఘటనలు, ఈవెంట్లను 24 గంటల పాటు పర్యవేక్షించడానికి ఈ వ్యవస్థను సీఈఆర్ టీ- ఇన్ టీఎస్ఏపీ (ముప్పు పరిస్థితుల అవగాహన ప్రొజెక్ట్లు)తో అనుసంధానించారు.

ఈ వ్యవస్థను సీఈఆర్ టీ ఇన్ "మధు-సంజల్" తో కూడా సమన్వయం చేశారు. ఇందులో భాగంగా సీఈఆర్ టీ ఇన్ ఒక హనీపాట్ సెన్సార్‌ను ఏర్పాటు చేసింది. ఇది హ్యాకర్ల ప్రవర్తనను, అనుమానాస్పద చొరబాటు ప్రయత్నాలను పర్యవేక్షిస్తుంది. వారి ఎత్తుగడలను, వ్యూహాలను నేర్చుకోవడం ద్వారా సైబర్ దాడుల నుంచి రక్షణను మరింత బలోపేతం చేయడానికి సహాయపడుతుంది.

భద్రతావరమైన సంఘటనలను తక్షణమే గుర్తించి వాటిని అరికట్టడానికి అక్కడి భద్రతా బృందం నిరంతరం భద్రతా నమోదు వివరాలను పర్యవేక్షిస్తుంటుంది.

'క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ది వరల్డ్' దార్శనికత కింద భారతదేశాన్ని ప్రపంచ కంటెంట్ హబ్‌గా నిలుపుతున్న వేవ్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ప్రభుత్వం నిర్వహిస్తోన్న 'క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ది వరల్డ్' కార్యక్రమం కింద భారతదేశాన్ని కంటెంట్ సృష్టికి ప్రపంచ కేంద్రంగా మార్చాలనే దార్శనికతకు అనుగుణంగా వేవ్స్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సదస్సు భారతీయ క్రియేటర్స్, నిర్మాతలు, అంకురాలకు 100 కంటే ఎక్కువ దేశాల నుంచి వచ్చిన ప్రపంచ స్థాయి కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు, ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు, సాంకేతిక నాయకులతో అనుసంధానం కావడానికి ఒక సమగ్ర వేదికను అందించింది.

దేశవ్యాప్త సృజనాత్మక ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించే 'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజెస్'లో (సీఐసీ) భాగంగా యానిమేషన్, గేమింగ్, ఏఆర్, వీఆర్, సంగీతం వంటి 33 విభాగాల్లో నిర్వహించిన పోటీలకు ప్రపంచ వ్యాప్తంగా ఒక లక్షకు పైగా రిజిస్ట్రేషన్లు వచ్చాయి.

ఈ విజేతలకు మెల్బోర్న్, ఒసాకా, టొరంటో, టోక్యో, మాడ్రిడ్, బుసాన్, ఖాన్ వంటి ప్రధాన అంతర్జాతీయ వేదికలలో పాల్గొనేందుకు, తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు, బీటూబీ సమావేశాల కోసం ప్రభుత్వం మద్దతు అందిస్తోంది. ఈ అవకాశం ఇండియాజాయ్, ఐజీడీసీ, ఐఎఫ్ఎఫ్ఐ గోవా వంటి జాతీయ కార్యక్రమాలలో కూడా కల్పిస్తున్నారు. తద్వారా సీఐసీ క్రియేటర్ల గుర్తింపునకు, మేధో సంపత్తి సృష్టికి ఒక కీలక ఇంజిన్‌గా నిలుస్తోంది.

మీడియా, వినోద రంగం కోసం అంకురాల నేతృత్వంలోని ఆవిష్కరణ, ఇంక్యుబేషన్ ప్లాట్‌ఫారమ్ అయిన వేవ్ఎక్స్ ఉద్యోగ సృష్టి, వ్యవస్థాపకతను ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం వేవ్ఎక్స్ భౌతిక, హైబ్రిడ్ మోడల్స్ కింద 34 అంకురాలను ఇంక్యుబేట్ చేస్తోంది. మరో 100 కంటే ఎక్కువ దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. 'కళాసేతు', 'భాషాసేతు' సవాళ్ల కింద ఎంపికైన 10 అంకురాలు ఇప్పటికే ప్రభుత్వ సంస్థలతో కలిసి పైలట్ ప్రాజెక్టులను చేపడుతున్నాయి. హైదరాబాద్‌లోని టీ-హబ్, ఐఐటీ ఢిల్లీకి చెందిన ఎఫ్ఐటీటీ, ఐఐసీటీ, ఎఫ్టీఐఐ, ఐఐఎంసీ వంటి ఇతర సంస్థలతో గల భాగస్వామ్యాల ద్వారా వేవ్ఎక్స్ దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించనుంది.

మరోవైపు భారతీయ దృశ్య శ్రవణ కంటెంట్ కోసం బీటూబీ సమావేశాలు, అనుమతులు, సహ-నిర్మాణం, అంతర్జాతీయ మార్కెట్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవటాన్ని సులభతరం చేసేందుకు వేవ్స్ బజార్ ఒక ఏడాది పొడవునా పనిచేసే డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌గా అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం వేవ్స్ బజార్‌లో 6,000 కంటే ఎక్కువ మంది విక్రేతలు, 4,000 కంటే ఎక్కువ మంది నమోదిత కొనుగోలుదారులు ఉన్నారు. వీరి మధ్య ఇప్పటికే 8,000 కంటే ఎక్కువ బీటూబీ సమావేశాలు జరిగాయి. నాలుగు ఖండాలలోని పది కంటే ఎక్కువ అంతర్జాతీయ మార్కెట్ల ద్వారా వేవ్స్ బజార్ పలు ఒప్పందాలు ఎంఓయూలు, పెట్టుబడి భాగస్వామ్యాలు, ప్రపంచ మార్కెట్ అవకాశాలను పెంపొందించడంలో తోడ్పడింది.

నైపుణ్యం, వ్యవస్థాపకత, ఉపాధి కల్పనను మరింత బలోపేతం చేయడానికి వేవ్స్ఎక్స్ ఇంక్యుబేషన్ సెంటర్ల విస్తరణ, 'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజెస్'ను నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ నిపుణులచే నిర్వహించబడే మాస్టర్‌క్లాస్‌లు, వర్క్‌షాప్‌లు, అవగాహన సెషన్లు సృజనాత్మక రంగంలోని సిబ్బంది నైపుణ్యాన్ని పెంచడంలో గణనీయంగా తోడ్పడుతున్నాయి. వేవ్స్ బజార్ ద్వారా కొనసాగుతున్న ప్రపంచ వ్యాప్త కార్యక్రమాలు.. సృజనాత్మక ప్రతిభను స్థిరమైన జీవనోపాధిగా మార్చడానికి, భారతీయ దృశ్య శ్రవణ కంటెంట్ ఎగుమతులలో వృద్ధిని సాధించడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

రాజ్యసభలో శ్రీ దీవక్ ప్రకాష్, శ్రీ ఉజ్వల్ దేవరావ్ నికామ్, శ్రీ కేసరిదేవ్‌సింగ్ ఝూలా అడిగిన ప్రశ్నకు సమాధానంగా సమాచార- ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఈ సమాచారాన్ని అందించారు.

వీణవంకలో మహాశివరాత్రి వేడుకలకు సర్వంసిద్ధం

కరీంనగర్, జఫిబ్రవరి 14: వీణవంక మండల కేంద్రంలోని అతిపురాతన శివాలయంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో నేడు జరుగనున్న మహాశివరాత్రి వేడుకలకు ఆలయకమిటీల ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. వీణవంక మండల కేంద్రంలో వెయ్యేళ్ళ చరిత్ర కగలిగిన శివాలయంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ప్రముఖ వేదపండితులు గూడ జగదీశ్వరశర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉదయం గోపూజ, ద్వాదశ జ్యోతిర్లింగముల దర్శనము, సామూహిక మహారుద్రాభిషేకము, ఎదుర్కోళ్ళు, రాత్రి శివపార్వతుల కల్యాణం, అర్ధరాత్రి లింగోద్భవము, అనంతరం ఊంజల్ సేవా, ఆదివారం ఉదయం అన్నపూజ, మధ్యాహ్నం మహాన్నదానము, సాయంత్రం రథోత్సవము ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ రామిడి శ్రీనివాస్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని మండల కేంద్రంతో పాటు నర్సింగాపూర్, చల్లూరు, మామిడాలపల్లి, ఎలుబాక, వలాపూర్, పోతిరెడ్డిపల్లి, కొండపాక, రెడ్డిపల్లి, ఘన్ముక్ల గ్రామాల ఉత్సవ కమిటీ చైర్మన్లు కోరారు.

వేయి స్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు షురూ

హన్మకొండ, ఫిబ్రవరి 14: చరిత్ర ప్రసిద్ధిగాంచిన రుద్రేశ్వర స్వామి వేయిస్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఆగమాను సారంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ మంగళవాయిద్య సేవ ఉత్తిష్ఠ గణపతికి హరిద్ర కుంకుమ విలేపణ అభిషేకం, రుద్రేశ్వరస్వామికి ఏకాదశి రుద్రాభిషేకం నిర్వర్తించి రుద్రేశ్వరీ-రుద్రేశ్వరస్వామివార్లను నంది వాహనంపై మంగళ వాయిద్యాల మధ్య వేదమంత్రాలతో ఎదురుకోలు నిర్వర్తించి రుద్రేశ్వరునికి ఎదురుగా సూర్యాలయంలో ఆది దంపతులను ప్రతిష్టించి గణపతి నవగ్రహ అష్టదిక్పాలక పూజలు నిర్వహించారు.

అనంతరం స్థానిక పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి-నీలిమ, గోదా-విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వద్దిరాజు వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరి, రాంరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి 5 రోజులపాటు జరిగే పంచాన్నిక దీక్ష ఉత్సవాలను బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో అగ్ని ప్రతిష్ఠాపన గణపతి నవగ్రహ పంచసూక్తములతో జయాధి హోమాలతో 18 అధ్యాయాలతో లోక కళ్యాణార్థం తెల్ల ఆవాలు, తోక మిరియాలు, ఇప్పపువ్వు, రక్తచందనం, సుగంధ ద్రవ్య పరిమళాలతో మహాచండీయాగం నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.అనిల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేద పండితులు భరత్‌శర్మ, శ్రీమన్నారాయణ, ప్రధ్యుమ్నశర్మ, గంగు మణికంఠ శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేందర్‌శర్మ పర్యవేక్షణలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

మహాశివరాత్రి.. రాత్రి కళ్యాణోత్సవం..

మహాశివరాత్రి మహా పర్వదినం ఉదయం తెల్లవారుజామున 3.30 గంటలకు మంగళ వాయిద్యసేవ ఉత్తిష్ఠ గణపతికి అభిషేకం, రుద్రేశ్వరునికి ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించి ఉదయం 5 గంటల నుంచి సామూహిక రుద్రాభిషేకాలు రాత్రి 10 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. సాయంత్రం 5.45 నిమిషాలకు ఉత్తరాషాఢ నక్షత్రయుక్త సింహ లగ్న సుముహూర్తమున రుద్రేశ్వరీ-రుద్రేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో 12 మంది వేదపండితుల ఆధ్వర్యంలో పాశుపత పూర్వకమహారుద్రాభిషేకం, నమకచమకాలతో రుద్ర ఆధ్యాయంతో 111 రుద్రములతో 101 లీటర్ల ఆవుపాలతో 51 కిలోల ఆవు పెరుగుతో 21 కిలోల పుట్టతేనెతో 11 కిలోల ఆవునెయ్యితో పండ్ల రసములతో మహారుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు, శివ ప్రీతికర మైన సోమవారం కూడా లింగోద్భవ కాల పూజ కలిసి వస్తుందని, జాగరణ ఉండే భక్తులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఏపీ అసెంబ్లీకి ఒకే రంగు చీరలో మహిళా ఎమ్మెల్యేలు.. సభకు ప్రత్యేక శోభ

అమరావతి, ఫిబ్రవరి 14: బడ్జెట్ సమావేశాల వేళ ఏపీ అసెంబ్లీలో అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. రేపటి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అధికార కూటమికి చెందిన మహిళా ప్రజా ప్రతినిధులు ఒకే రంగు చీరలు ధరించి సభకు రావడంతో అసెంబ్లీలో ఆధ్యాత్మిక, ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు భారతీయ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తూ ఒకే రకమైన వస్త్రధారణతో సభకు హాజరయ్యారు.

ఆదివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా.. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సహా పలువురు మహిళా ప్రజాప్రతినిధులు శివతత్వానికి ప్రతీకగా నిలిచే ప్రత్యేకమైన చీరలను ధరించి సభకు వచ్చారు. వారి రాకతో శాసనసభ ప్రాంగణం కళకళలాడింది. మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, ఎన్ సవితతోపాటు ఇతర మహిళా ఎమ్మెల్యేలు సైతం ఈ ప్రత్యేక డ్రెస్ కోడ్‌ను పాటించారు. ఒకే రంగు, ఒకే తరహా వస్త్రధారణతో కనిపించిన వారు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ సందర్భంగా మహిళా ఎమ్మెల్యేలంతా కలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు చూపిన ఉత్సాహాన్ని, వారి ఐక్యతా స్ఫూర్తిని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. సంస్కృతీ సంప్రదాయాలకు విలువ ఇస్తూ.. పండుగ స్ఫూర్తిని సభకు తీసుకురావడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. మహిళా శక్తికి, వారి సంఘటితత్వానికి ఇది నిదర్శనమని కొనియాడారు.

ఇదిలావుంటే రాజకీయాలకు అతీతంగా శాసనసభ వేదికగా మన సంప్రదాయాలను గౌరవించుకోవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఈ ముందస్తు శివరాత్రి వేడుకల సందడి అసెంబ్లీకి కొత్త శోభను తీసుకొచ్చింది.

రైతు సంఘాల నేతలతో రాహుల్ గాంధీ భేటీ.. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలపై చర్చ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పలు రైతు సంఘాల నేతలను కలిశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన ఆయన పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో రైతు నేతలతో భేటీ అయ్యారు. భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాలపై చర్చించారు. ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుఖ్‌పాల్ ఎస్ ఖైరా, హర్యానాకు చెందిన భారతీయ కిసాన్ మజ్దూర్ యూనియన్ నేత అశోక్ బల్హారా, బీకేయూ క్రాంతికారి నేత బల్దేవ్ ఎస్ జిరా, ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ ఫ్రంట్‌కు చెందిన ఆర్ నందకుమార్ తదితరులు రాహుల్ గాంధీని కలిసిన వారిలో ఉన్నారు.

కాగా, భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాలపై రైతు సంఘాల నేతలతో రాహుల్ గాంధీ చర్చించారు. సోయాబీన్, పండ్లు, గింజలు, పత్తి, మొక్కజొన్న రైతుల ప్రయోజనాలు, జీవనోపాధిపై ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలు కాపాడటంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి మోదీ లొంగిపోయారని, దేశ రైతులను ఆయన మోసం చేశారని సోషల్ మీడియాలో విమర్శించారు.

మరోవైపు రైతు సంఘాల నేతలతో రాహుల్ గాంధీ సమావేశంపై బీజేపీ స్పందించింది. ఇది కల్పిత, కృతిమ భేటీ అని విమర్శించింది. రాహుల్ గాంధీ ఆరోపణలు నిరాధార మని, భాంత రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నమని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఆరోపించారు.

ప్రియురాలితో బ్రేకప్.. వాలంటైన్స్ డే రోజున యువకుడు ఆత్మహత్య

లక్నో, ఫిబ్రవరి 14: ప్రియురాలు బ్రేకప్ చెప్పడంతో ప్రియుడు మనస్తాపం చెందాడు. ప్రేమికుల దినోత్సవం రోజున రూమ్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ప్రియురాలు, ఆమె స్నేహితుడు కలిసి అతడ్ని హత్య చేసినట్లు యువకుడి కుటుంబం ఆరోపించింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ సంఘటన జరిగింది. 17 ఏళ్ల అమన్ గిరి ఇంటర్ చదువుతున్నాడు. ఎన్డీఏ పరీక్ష కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. ఎన్డీయే కోచింగ్‌కు వస్తున్న యువతి అతడికి పరిచయమైంది. దీంతో ఎనిమిది నెలలుగా వారిద్దరూ ప్రేమలో ఉన్నారు.

కాగా, ఆ జంట మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో ఆ యువతి బ్రేకప్ చెప్పింది. మరో వ్యక్తితో ఆమె రిలేషన్‌లో ఉన్నది. అయితే బ్రేకప్ భరించలేని అమన్ దారుణ నిర్ణయం తీసుకున్నాడు. ప్రేమికుల దినోత్సవం రోజైన శనివారం తన రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పడమటిపల్లిలో భవానీ రామలింగేశ్వర స్వామి వార్షికోత్సవం

–హాజరైన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

నల్గొండ, ఫిబ్రవరి 14: దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలో గల శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం వైభవంగా ప్రారంభమైంది.

స్వామి వారిని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, సర్పంచ్ పల్లా శ్రీకాంత్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, సంకు కొండల్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, వాజిద్ పాషా పాల్గొన్నారు.

మహాశివరాత్రి స్పెషల్.. రాయపోల్‌లో జాతరకు ముస్తాబైన దేవాలయాలు

మెదక్, ఫిబ్రవరి 14: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం, మంతూరు తదితర గ్రామాల్లో శివాలయాలు ఉత్సవ శోభతో ముస్తాబ య్యాయి. రామారం మహాదేవుని ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా పంచామృత రుద్రాభిషేకం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం రుద్రహోమం అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా జరపనున్నారు.

మంగళవారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్, పాలకవర్గ సభ్యులు తెలిపారు. మంతూరులో మల్లన్న కళ్యాణం.. మహాశివరాత్రి సందర్భంగా మంతూరు గ్రామంలోని మల్లన్న గుట్ట ఆలయంలో శనివారం హోమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం అభిషేకం నిర్వహించి, సాయంత్రం మల్లన్న కళ్యాణం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

పార్థేశ్వరాలయంలో కళ్యాణ మహోత్సవం..

రాయపోల్ మండల కేంద్రంలోని శ్రీ ఉమా పార్థీవేశ్వర ఆలయంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం. పుష్పాలంకరణ. బిల్వార్చన. మంగళ హారతి. మంత్రపుష్పం. తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం స్వామివారి ఎదుర్కోలు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి ఉదయం 5 గంటల వరకు లింగోద్భవ కాలానికి పంచా మృత అభిషేకం స్వామి వారి అలంకరణ మంగళ హారతులు తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారు..

–ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారని.. రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టం అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్ లు నిర్మించారన్నారు.

సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. గతంలో నీరు, విద్యుత్ లేక రాష్ట్రంలో రైతులు ఇబ్బంది పడ్డారని.. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారని తలసాని అన్నారు. నేను టీడీపీలో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేది. అందరి పోరాటం వల్ల వచ్చిన రాష్ట్రాన్ని కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారు. సిద్దిపేటను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారు.

రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వం లో కుదేలు అయింది. కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయన్నారు. కేసీఆర్ తెచ్చిన రైతుబంధు పథకాన్ని ఐక్యరాజ్య సమితి అభినందించిందని తలసాని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులు మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది . కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుందని ఆరోపించారు.

ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు..

మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులు, మద్యం ఏరులై పారింది. కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్ల లాగా గెలిచిందన్నారు తలసాని. మా కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారు. రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు ప్రజలు శాశ్వతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవని.. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ పెట్టి పురుషులకు డబుల్ రెట్లు పెంచారని తలసాని మండిపడ్డారు.

ఉన్నత విద్య సంస్థల్లో యుజిసి సమానత్వ నిబంధనలను తక్షణమే అమలు చేయాలి

– విశ్వవిద్యాలయాల్లో కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలి

–ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజినీకాంత్

రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి 14: నేటినిజం (ప్రతినిధి): విశ్వవిద్యాలయాల్లో కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజినీకాంత్ అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రజినీకాంత్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాల్లో కుల వివక్షతతో విద్యార్థులు మానసికంగా ఇబ్బందులు పడుతూ చదువులకు దూరమైన పరిస్థితి ఉందని అన్నారు.కుల వివక్షతను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహానికి సంబంధించిన యుజిసి నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రీసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల కులవ్యక్షతకు ఎదుర్కొని మరణించడం జరిగిందని గుర్తు చేశారు. ఎంతో మంది విద్యార్థులు విశ్వవి ద్యాలయాల్లో కుల వివక్షతను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం పకడ్బందీగా నిబంధనలను అమలు చేయాలని కోన్నారు .యూజీసీ నివేదిక ప్రకారం 118 శాతం కుల వివక్షపై ఫిర్యాదులు పెరిగినాయని, ఈ వివక్షత వల్ల విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లకుండా ఆరు శాతం తగ్గాయని తెలిపారు.అన్ని విశ్వ విద్యాలయాల్లో రోహిత్ వేముల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.రానున్న రోజుల్లో హైయర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బిల్ దేశంలో అమలు అయితే పేద బడుగు బలహీన వర్గ విద్యార్థులు ఇంకా వివక్షతకు ఎదుర్కొం టారని అన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన విద్యా విధానం 2020 ఐదు సంవత్స రాలు గడుస్తుందని, ఈ ఐదు సంవత్సరాల్లోనే సంఘ్ పరివార్ అరాచకాలు పెరిగినయని విమ ర్శించారు. టిస్ సెంట్రల్ యూని వర్సిటీ దళిత పరిశోధకుడి పై దాడి, ఇలా రోజు రోజుకు విద్యాలయాలలో వివక్షతో దాడు లు పెరిగిపోతున్నాయని అన్నా రు.కేంద్ర ప్రభుత్వం సమాజాన్ని కుల ఆధారంగా విభజించే మనువాద సిద్ధాంతాలను వేగంగా రుద్దుతుందని విమర్శించా రు.విద్యాలయాల్లో వివక్షతకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుండెల్లి కళ్యాణ్, మల్లారపు ప్రశాంత్, ఉపాధ్యక్షులు మనోజ్, సంజన, శివ పాల్గొన్నారు.

నేటి నుండి కోటిలింగాల జాతర

ఖమ్మం, ఫిబ్రవరి 14: కారేపల్లి మండల పరిధిలోని పోలంపల్లి గ్రామ పంచాయతీలో గల కోటిలింగాల జాతర మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు కొనసాగనున్నది. ఇల్లెందు డివిజన్‌లో రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధి గాంచిన ఇక్కడకు వేలాది మంది భక్తులు తరలివచ్చి పక్కనే గల కోటిలింగాలవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం శివుడిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకుంటారు. ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల నుండి భక్తులు కుటుంబ సమేతంగా తరలిరావడంతో మూడు రోజుల పాటు కోటిలింగాల ప్రాంతమంతా శివ నామస్మరణలతో మారుమ్రోగుతుంది. కోటిలింగాల వాగు తీరాన కాకతీయుల కాలంలో శివుడు స్వయంబుగా వెలిసినట్లు చరిత్ర. ఈ ఆలయ ప్రాంగణంలో 108 శివలింగాలు, నాగేంద్రుడి విగ్రహం, సాలెపురుగు వంటి ఆకృతులను దాతల సహకారంతో ప్రతిష్టించారు.

అయితే కొన్ని దశాబ్దాల కాలంగా పోలంపల్లికి చెందిన ఆదివాసీ కుటుంబం వారు ఈ జాతరను నిర్వహిస్తూ వస్తున్నారు. నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో క్యూలైన్లు, చలువ పందిర్లను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. వాగులోకి దిగలేని భక్తుల కోసం విద్యుత్ మోటార్ల ద్వారా స్నానాలు చేసే అవకాశం కల్పించారు. ఇల్లెందు–మహబూబూబాద్ ఆర్అండ్ రోడ్డు నుండి లోపలకు కిలోమీటర్ దూరం వెళ్లి కోటిలింగాల ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. కాబట్టి కారేపల్లి పోలీస్ శాఖ వారు వాహనదారులు, కాలినడకన వచ్చే వారికి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

గేట్ కారేపల్లి బుగ్గవాగు సమీపంలో గల శ్రీ ఉమాసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు స్వామివారి కల్యాణ ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం ముత్యాలమ్మ, బొడ్రాయి, అంజనేయస్వామికి అభిషేకం పూజలు, వస్త్రధారణ, ఇత్యాధికృములతో ఉత్సవాలు ప్రారంభమౌతాయి. అదే రోజు రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణంను కన్నుల పండుగగా నిర్వహిస్తారు.

ఎలుకల మందు ఇచ్చి కన్న బిడ్డల్ని హత్య చేసిన తల్లి.. వివాహేతర సంబంధం కోసమే

పంజాబ్, ఫిబ్రవరి 14: మాతృత్వానికే మచ్చ తెచ్చేలా చేసిందో మహిళ. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని కన్న బిడ్డల్ని హత్య చేసింది. రెండు పసి ప్రాణాల్ని తీసేసింది. ఈ ఘటన పంజాబ్‌లోని భతిండా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిని వివరాల ప్రకారం.. జస్సీ కౌర్ అనే మహిళకు ఇద్దరు పిల్లలు. సుఖ్‌ప్రీత్ కౌర్ (8) అనే కూతురు, ఫతేవీర్ (6) అనే కొడుకు ఉన్నారు. అయితే, జస్సీ కౌర్‌కు వేరొక వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. వారి బంధానికి పిల్లలు అడ్డుగా ఉన్నారని భావించిన జస్సీ.. వారి అడ్డు తొలగించుకోవాలని చూసింది.

ఈ బంధం మత్తులో కన్నబిడ్డలపై మమకారాన్ని మర్చిపోయింది. పసి పిల్లలు అని కూడా చూడకుండా హత్య చేయాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం ఒక పథకం రచించింది. ఎవరికీ తనపై అనుమానం రాకుండా వారిని చంపాలని చూసింది. రెండు వారాల క్రితం కుమార్తె సుఖ్‌ప్రీత్ కౌర్‌కు ఆహారంలో ఎలుకల మందు కలిపి తినిపించింది. పాపం ఇది తెలియని ఎనిమిదేళ్ల ఆ చిన్నారి.. తన తల్లి ఇచ్చిన ఆహారం తిని చనిపోయింది. ఆ పాపది హత్య కాదని చుట్టుపక్కల వారిని, బంధువుల్ని ఏదోలా నమ్మించింది. 15 రోజుల క్రితం ఆ చిన్నారి అనుమానాస్పదంగా మరణించినప్పటికీ కన్న తల్లే సహజ మరణం, అనారోగ్యం అని చెబుతుండటంతో అప్పటికి పెద్ద గా పట్టించుకోలేదు. అయితే, రెండు వారాల తర్వాత శుక్రవారం కూడా ఆమెకు మిగిలి ఉన్న ఆరేళ్ల కొడుకు ఫతేవీర్ కౌర్‌కు కూడా ఇలాగే ఎలుకల మందు కలిపిన ఆహారం తినిపించింది.

దీంతో శనివారం ఆ బాలుడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. కానీ, ఈసారి అందరికీ అనుమానం వచ్చింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇద్దరు చిన్నారుల మరణాలు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు జస్సీ కౌర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తను చేసిన నేరాన్ని ఒప్పుకొంది.

ప్రతిపక్ష పాత్రలో ప్రజల పక్షాన నిలబడతాం

–బీజేపీ గెలుపులో మాజీ బీఆర్ఎస్ నేతలే ఎక్కువ

కాంగ్రెస్ – బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం

బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లహరి శంకర్

కరీంనగర్, జనవరి 14:(నేటినిజం ప్రతినిధి) నగర పాలక సంస్థ ఎన్నికల తీర్పును గౌరవిస్తూ, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడతామని , నగర ప్రజల సమస్యలపై రాజీ పడకుండా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు.శనివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజల తీర్పును శిరసావహిస్తున్నామని, తమను ఆదరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.కార్పొరేషన్‌లో బీజేపీ సాధించిన 30 సీట్లలో 11 మంది మాజీ బీఆర్ఎస్ అభ్యర్థులే ఉన్నారని, ఇతర పార్టీల నేతలను చేర్చుకుని గెలవడం బీజేపీ నైతిక విజయం కాదని విమర్శించారు.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇతర మున్సిపాలిటీల్లో బీజేపీ పరాజయం పాలవ్వడం కేంద్ర మంత్రి బండి సంజయ్ వైఫల్యమేనని ఎద్దేవా చేశారు. మేయర్ ప్రమాణ స్వీకారానికి ముందే బండి సంజయ్ ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని హరిశంకర్ డిమాండ్ చేశారు.గత పదేళ్లుగా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన సంజయ్, అదే పార్టీకి చెందిన వారిని బీజేపీలో ఎలా చేర్చుకున్నారో సమాధానం చెప్పాలన్నా రు.ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి రూ.50 లక్షలు ఖర్చు చేశారని ఆరోపిస్తూ, ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వెల్లడించాలన్నారు.ఎన్నికల వేళ కాంగ్రెస్ , బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని ఆరోపించారు.గతంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ హయాంలో అభ్యర్థులు అక్రమాలకు పాల్పడితే ఫిర్యాదు చేయాలని ధైర్యంగా చెప్పారని, ఇప్పుడు బండి సంజయ్ తన కార్పొరేటర్ల విషయంలో అలాంటి హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు.ఎన్నికల ముందు ప్రత్యేక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని చెప్పిన బండి సంజయ్, గెలిచిన తర్వాత మాట మార్చారని విమర్శించారు.డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థులను లేకుండా చేస్తానని వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, రాజకీయ ప్రతీకారం కాకుండా అభివృద్ధి మీద దృష్టి పెట్టాలని సూచించారు.

శివోహం! శివోహం

పండుగ ప్రాశస్త్యం :

శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహాశివరాత్రి. హిందువులు జరుపు కునే ముఖ్యమైన పండుగల్లో శివరాత్రి కూడా ఒకటి. శివపురాణంలో మహాశివరాత్రికి సంబంధించి అనేక కథలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం మాఘ మాసంలోని కృష్ణ పక్షం చతుర్దశి రోజున మహా శివరాత్రి వస్తుంది. ఈ విశిష్టమైన రోజున శివుడిని భక్తి శ్రద్ధల తో పూజిస్తే సకల శుభాలు జరుగుతాయి శాస్త్రవచనం. దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. శివుడికి అంకితం చేయబడిన అతి ముఖ్య మైన పండుగగా మహాశివరాత్రిని పరిగణి స్తారు. ప్రతి సంవత్సరం మాఘ మాసం కృష్ణ పక్షంలో 14వ రోజున అంటే బహుళ చతుర్దశి తిథి రోజున మహాశివరాత్రి పండుగ జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి, 15 వ తేది ఆదివారం జరుపుకోవాలన్నది పండిత ఉవాచ.

పురాణ గాథ :

దేవతలు, రాక్షసులు క్షీరసాగర మథన సమయంలో ఉద్భవించిన హాలాహలాన్నుంచి ప్రపంచాన్ని కాపాడటం కోసం శివుడు దాన్ని సేవించిన సందర్భంలో, ముక్కోటి దేవతలు భక్తితో ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ, అంటూ కీర్తిస్తూ, ఆనంద పారవశ్యంలో ముంచెత్తారంటారు. తద్వారా హాలాహలాన్ని శివ మహదేవుడు గుటక వేయకపోవడంతో కంఠంలో దాచుకుని నీలకంఠుడనే పేరు పొందిన రాత్రి ఇది. ప్రపంచాన్ని చుట్టుముట్టే ప్రళయం ఆగిపోయిన సంఘటన ఆధారంగా నాటి నుండి శివరాత్రిని మహా శివ రాత్రి పండుగను భారతదేశంలోనూ, విదేశాల్లో ఉన్న హిందువులు వారి వారి ఆనవాయితీనీ అనుసరించి అనేక విధాలుగా శివ మహదేవుని భక్తీ శ్రద్ధలతో అరాదిస్తుండటం ఆనాదిగా వస్తున్న సంప్రదాయం. మహా శివరాత్రి గురించి స్కాంద పురాణం, లింగ పురాణం, పద్మ పురాణాలతో సహా అనేక పురాణాలలో ప్రస్తావించబడింది. ఈ మధ్యయుగపు శైవ గ్రంథాలు ఈ పండుగను వివిధ రకాలుగా వర్ణించాయి. వీటిలో ఉపవాసం, శివుని చిహ్నంగా భావించే శివలింగానికి పూజలు చేయడం వంటివి ఉన్నాయి. వివిధ పురాణాలు మహా శివరాత్రి యొక్క ప్రాముఖ్యతను వివరిస్తాయి. శైవ సంప్రదాయంలో ఒక పురాణం ప్రకారం, సృష్టి, స్థితి, లయ కారకుడైన శివుడు తాండవం చేసే రాత్రి ఇది. స్తోత్రాలు, శైవ గ్రంథాల పఠనం, భక్తుల హోరు ఈ విశ్వ నృత్యంలో చేరి, ప్రతిచోటా శివుని ఉనికిని గుర్తు చేస్తుంది. మరొక పురాణం ప్రకారం, ఇది శివుడు పార్వతిని వివాహం చేసుకున్న రాత్రిగా వేరొక పురాణం ప్రకారం శివరాత్రి అనేది సంవత్సరాని కొకసారి శివలింగాన్ని పూజించడం, గతంలో చేసిన పాపాలను ప్రక్షాళన చేసుకోవ డానికి, పుణ్య మార్గంలో జీవించి కైలాసాన్ని చేరుకోవ డమంటారు. మహా శివరాత్రి పండుగకు సంబం ధించి మానవ జీవితంలో తెలిసి కాని, తెలియకగాని శివరాత్రి నాడు శివరాత్రి ప్రతమను ఒక్కమారు చేసినను యముని నుండి తప్పుంచుకొని ముక్తి పొందు దురని దాని దృష్టాంతముగా ఈ క్రింది కథను శివుడు పార్వతికి తెలిపిన వృత్తాంతంగా పేర్కొనవచ్చు.

మహాశివరాత్రి వ్రత కథ :

ఒకనాడు కైలాసపర్వత శిఖరముపై పార్వతీపరమేశ్వరులు సుఖాసీనులై ఉండగా పార్వతి శివునితో అన్ని వ్రతములలోను ఉత్తమమగు వ్రతమును భక్తి ముక్తి ప్రదాయకమైన దానిని తెలుపమని కోరెను. అప్పుడు శివుడు శివరాత్రి వ్రతమనుదాని విశేషాలను తెలియజేస్తాడు. దీనిని మాఘబహుళచతుర్దశి నాడు ఆచరించవలెనని, తెలిసికాని, తెలియకగాని ఒక్కమారు చేసినను యముని నుండి తప్పుంచుకొని ముక్తి పొందుదురని దాని దృష్టాంతముగా ఈ క్రింది కథను వినిపించెను. ఒకప్పుడు ఒక పర్వతప్రాంతమున హింసావృత్తిగల వ్యాధుడొకడు వుండెను. అతడు ప్రతి ఉదయం అడవికి వేటకు వెళ్ళి సాయంత్రం ఏదేని మృగమును చంపి తెచ్చుచు కుటుంబాన్ని పోషించేవాడు. కానీ ఒకనాటి ఉదయమున బయలుదేవి అడవియంతా తిరిగినా ఒక్క మృగము కూడా దొరకలేదు. చీకటిపడుతున్నా ఉత్తచేతులతో ఇంటికి వెళ్ళడానికి మనస్కరించక వెనుతిరిగెను. దారిలో అతనికొక తటాకము కనిపించెను. ఏవైనా మృగాలు నీరు త్రాగుట కోసం అచ్చటికి తప్పకుండా వస్తాయని వేచియుండి వాటిని చంపవచ్చునని ఆలోచించి దగ్గరనున్న ఒక చెట్టెక్కి తన చూపులకు అడ్డముగా నున్న ఆకులను, కాయలను విరిచి క్రింద పడవేయసాగెను. చలికి "శివ శివ" యని వణుకుచూ విల్లు ఎక్కిపెట్టి మృగాల కోసం వేచియుండెను. మొదటిజామున ఒక పెంటిలేడి నీరు త్రాగుటకు అక్కడికి వచ్చెను. వ్యాధుడు దానిపై బాణము విడువబోగా లేడి భయపడక "వ్యాధుడా! నన్ను చంపకుము" అని మనుష్యవాక్కులతో ప్రార్థించెను. వ్యాధుడు ఆశ్చర్యపడి మనుష్యులవలె మాట్లాడు నీ సంగతి మరొక పెంటిజింక ఇచటికి వచ్చును. అది బాగుగా బలిసినది, కావున దానిని చంపుము. లేనిచో నేను వసతికి వెళ్ళి ప్రసవించి శిశువును బంధువుల కప్పగించి తిరిగి వస్తాను" అని అతన్ని వొప్పించి వెళ్ళెను. రెండవజాము గడిచెను. మరొక పెంటిజింక కనిపించెను. వ్యాధుడు సం తోషించి విల్లెక్కుపెట్టి బాణము విడువబోగా అదిచూచిన జింక భయపడి మానవ వాక్కులతో "ఓ వ్యాధుడా, నేను విరహము తో కృశించియున్నాను. నాలో మేదోమాం సములు లేవు. నేను మరణించినా నీ కుటుంబానికి సరిపోను. ఇక్కడికి అత్యంత స్థూలమైన మగజింక యొకటి రాగలదు. దానిని చంపుము, కానిచో నేనే తిరిగివత్తును" అనెను. వ్యాధుడు దానిని కూడా విడిచిపెట్టెను. మూడవజాము వచ్చెను. వ్యాధుడు ఆకలితో జింక కోసం వేచియుండెను. అంతలో ఒక మగజింక అక్కడికి వచ్చెను. వింటితో బాణము విడువబోగా ఆ మృగము వ్యాధుని చూచి మొదటి రెండు పెంటి జింకలు తన ప్రియురాలుల్ని తానే చంపెనా అని ప్రశ్నించెను. అందుకు వ్యాధుడు ఆశ్చర్యపడి రెండు పెంటిజింకలు మరలివచ్చుటకు ప్రతిజ్ఞచేసి వెళ్ళినవి, నిన్ను నాకు ఆహారముగా వంపుతాయని చెప్పాయని అన్నాడు. ఆ మాట విని "నేను ఉదయాన్నే మీ ఇంటికి వచ్చెదను నా భార్య ఋతుమతి. ఆమెతో గడిపి బంధుమిత్రుల అనుజ్ఞపొంది మరలివత్తును అని ప్రమాణములు చేసి వెళ్ళెను. ఇట్లు నాలుగు జాములు గడిచి సూర్యోదయ సమయంలో వ్యాధుడు జింకల కొరకు ఎదురుచూచుచుండెను. కొంతసే పటికి ఆ నాలుగు జింకలును వచ్చి నన్ను మొదట చంపుము, నన్నే మొదట చంపుమని అనుచు వ్యాధుని ఎదుట మోకరిల్లెను. అతడు మృగముల సత్యనిష్టకు ఆశ్చర్యపడెను. వానిని చంపుటకు అతని మనసు ఒప్పలేదు. తన హింసావృత్తిపై జుగుప్స కలిగెను. "ఓ మృగములారా ! మీ నివాసములకు వెళ్ళుము. నాకు మాంసము అక్కరలేదు. మృగములను బెదరించుట, బంధించుట, చంపుట పాపము. కుటుంబము కొరకు ఇక నేనా పాపము చేయను. ధర్మములకు దయ మూలము. దమయు సత్యఫలము. నీవు నాకు గురువు, ఉపదేష్టవు. కుటుంబ సమేతముగా నీవు వెళుము. నేనిక సత్యధర్మము నాశ్రయించి అస్త్రములను వదలిపెట్టుదును." అని చెప్పి ధనుర్బాణ ములను పారవేసి మృగములకు ప్రదక్షిణ మాచరించి నమస్కరించెను. అంతలో ఆకాశమున దేవదుందుభులు మ్రోగెను. పుష్పవృష్టి కురిసెను. దేవదూతలు మనోహరమగు విమానమును తెచ్చి యిట్ల నిరి : ఓ మహానుభావా. శివరాత్రి ప్రభావమున నీ పాతకము క్షీణించింది. ఉపవాసము, జాగరమును జరిపితివి, తెలియకయే యామ, యామమునను పూజించితివి, నీవెక్కినది బిల్వవృక్షము. దానిక్రింద స్వయం భూలింగమొకటి గుబురులో మరుగుపడి యున్నది. నీవు తెలియకయే బిల్వపత్రముల త్రుంచివేసి శివలింగాన్ని పూజించితివి. సశరీరముగా స్వర్గమునకు వెళ్ళుము. మృగరాజా! నీవు సకుటుంబ ముగా నక్షత్రపదము పొందుము."

ఈ కథ వినిపించిన పిదప పరమేశ్వరుడు పార్వతితో నిట్లనెను: దేవీ! ఆ మృగకుటుం బమే ఆకాశమున కనిపించు మృగశిర నక్షత్రము. మూడు నక్షత్రములలో ముందున్న రెండూ జింకపిల్లలు, వెనుక నున్న మూడవది మృగి. ఈ మూడింటిని మృగశీర్ష మందురు. వాని వెనుక నుండు నక్షత్రములలో ఉజ్జ్వలమైనది లుబ్ధక నక్షత్రము, అంటూ తెలిపెను. ఆ తరువాత బ్రహ్మ, విష్ణువు ఆదిగా గల దేవతలు శివుడిని ధూపదీపా లతో అర్చించారు. దీనికి మెచ్చి శివుడు అక్కడి వారితో "మీరీనాడు చేసిన పూజకు సంతసించితిని. ఈ రోజు నుండి నేను అవతరించిన ఈ తిథి శివరాత్రి పర్వదిన ముగా ప్రసిద్ధి చెందుతుంది. ఈ రోజున ఉపవాసము చేసి భక్తితో నన్ను లింగ రూపముగా, సాకార రూపముగా ఎవరు అర్చిస్తారో వారికి మహాఫలము కలుగుతుంది" అని చెబుతాడు. తదాదిగా నాటి నుండి శివార్చన జరుపుకోవడంగా వస్తున్న సంప్రదాయం.

జాగరణము:

జాగరణము అనగా ప్రకృతిలో నిద్రాణమైయున్న శివశక్తిని, శివపూజా భజన లీలా శ్రవణాదులతో మేల్కొలిపి, తాను శివుడై, సర్వమును శివస్వరూ పముగా భావించి, దర్శించుటయే నిజమైన జాగరణము. అప్పుడు శివపూజ లో సాయుజ్యము, శివభజనలో సామీప్య ము, శివభక్తులతో కూడి, శివ విషయ ములు ప్రసంగించుటలో సలోక్యము, శివధ్యానములో సారూప్యము సిద్ధించునని ఆదిశంకరాచార్యులు మాట ప్రత్యక్ష సత్యమగును. ఈ నాలుగింటిని శివరాత్రి నాడు ప్రత్యక్షముగా సాధించుటయే శివరాత్రి జాగరణము. జాగరణ దినమున ఉపవాసము ఉంటారు. ఈ జాగరణ సమయంలో తామున్న గృహ ఆవరణ లోనో, తమ స్వంత పంటపొలాల్లోనో అక్కడి మట్టితో అక్కడే శివలింగాన్ని తయారుచేస్తూ జాముకొక శివలింగం తయారుచేసి పూజిస్తారు. సుభమ్ ఓం నమః శివాయః

లింగాభిషేకం, బిల్వార్చన :

మహా శివరాత్రి రోజున, శివుడు లింగోద్భవ వేళ, లింగ రూపంలో ఉన్న శివునికి పూజలు జరుపుకుంటారు. ఈ రోజున, అన్ని శివాలయాలులో, అత్యంత పవిత్రమైన లింగోద్భవ పూజ నిర్వహిస్తారు. వేదాలలోనుండి ప్రత్యేకమైన మంత్రాలను రుద్ర సూక్తంగా పండితులచే పఠించబడుతుంది. దీనిని శివలింగానికి ప్రాతఃకాల ంలో పవిత్రస్నానం చేయిస్తారు. దీనినే రుద్రాభిషేకం అంటారు. శివలింగంతో బాటు గండకీ నదిలో మాత్రమే లభించే సాలిగ్రామం కూడా పూజలందు కుంటు ంది. దీనిద్వారా మనసులోని మలినాల్ని తొలగించుకోవడమే ఇందులోని పరమా ర్థం. శివ భక్తులకు అత్యంత పర్వదినం. శివరాత్రి రోజున, శివభక్తులు తెల్లవారు జామున లేచి, స్నానం చేసి, పూజలు చేసి, ఉపవాసం ఉండి రాత్రి అంతా జాగరణము చేసి మరునాడు భోజనం చేస్తారు. లింగ రూపంలో ఉన్న శివ లింగానికి పాలు, పెరుగు, నెయ్యి తేనే, పంచదార, పండ్లు, పువ్వులు ఇత్యాదులతో అభిషేకం, ఇంకా బిల్వార్చనకు శివ లింగానికి ప్రీతి పాత్రమైన బిల్వపత్రాలు సమర్పిస్తారు. శివరాత్రి రోజున, రాత్రంతా శివ పూజలు, అభిషేకములు, అర్చనలు, శివలీలా కథాపారాయణలు జరుపుతారు. అన్ని శివక్షేత్రాలలో ఈ ఉత్సవము గొప్పగా జరుగుతుంది . పూర్వం శ్రీశైలం క్షేత్రంలో జరిగే ఉత్సవమును పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రములో విపులంగా వర్ణించాడు. శైవులు ధరించే భస్మము/విభూతి తయారుచేయటానికి ఈనాడు పవిత్రమైనదని భావిస్తారు. రోజు అంతా భక్తులు "ఓం నమః శివాయ", శివ యొక్క పవిత్ర మంత్రం పఠిస్తారు.

భారతదేశంలో మహా శివరాత్రి:

భారతదేశంలో శివునికి అంకితం చేయబడిన అనేక ప్రముఖ దేవాలయాలు (శివాలయాలు) ఉన్నాయి, ఇవి తరచుగా లింగ రూపంలో కొలువై ఉంటాయి. కేదార్‌నాథ్, కాశీ విశ్వనాథ్, సోమనాథ్, మరియు అమర్‌నాథ్ వంటి జ్యోతిర్లింగాలు మరియు పుణ్యక్షేత్రాలు అత్యంత ప్రసిద్ధి చెందినవి. ఈ ఆలయాలు ఆధ్యాత్మికతకు, అద్భుతమైన నిర్మాణ శైలికి నిలయాలు.

కాశీ విశ్వనాథ్ ఆలయం (వారణాసి, ఉత్తరప్రదేశ్) : అత్యంత పవిత్రమైన జ్యోతిర్లింగాలలో ఒకటి.

కేదార్‌నాథ్ ఆలయం (ఉత్తరాఖండ్) : హిమాలయాల్లోని ప్రసిద్ధ జ్యోతిర్లింగ క్షేత్రం.

సోమనాథ్ ఆలయం (గుజరాత్): మొదటి జ్యోతిర్లింగంగా ప్రసిద్ధి.

మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగం (ఉజ్జయిని, మధ్యప్రదేశ్): భస్మ ఆర్తికి ప్రసిద్ధి.

అమర్‌నాథ్ గుహ (జమ్మూ కాశ్మీర్): మంచుతో ఏర్పడే శివలింగం.

నాగేశ్వర జ్యోతిర్లింగం (గుజరాత్): ద్వారక సమీపంలో ఉంది.

తుంగ్ నాథ్ (ఉత్తరాఖండ్): అత్యంత ఎత్తైన శివాలయం.

లింగరాజ దేవాలయం (భువనేశ్వర్, ఒడిశా): అద్భుతమైన నిర్మాణ శైలి.

రామనాథస్వామి ఆలయం (రామేశ్వరం, తమిళనాడు): దక్షిణ భారత దేశంలోని ముఖ్యమైన క్షేత్రం.

శ్రీశైలం మల్లికార్జున స్వామి (ఆంధ్ర ప్రదేశ్): 12 జ్యోతిర్లింగాలలో ఒకటి.

ఈ దేవాలయాలు శివ భక్తులకు అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలుగా పరిగణించబడతాయి. ఈ ఆలయాలు ఆధ్యాత్మికతకు, అద్భుతమైన నిర్మాణ శైలికి నిలయాలు.

ఇక్కడికి శివ భక్తులు పెద్ద సమూహాములతో మహా శివరాత్రి రోజున ప్రార్థనలు చేయడానికి ప్రతి సంవత్సరం చేరుకుంటారు. జబల్పూర్ నగరంలో తిల్వారా ఘాట్, రెండు ఇతర ప్రదేశాలు అయిన జియోనార గ్రామంలో మఠం ఆలయం, సియోనీ పేరున, పండుగను చాలా మతపరమైన ఆనందంతో జరుపు కుంటారు.

విదేశాల్లో మహాశివరాత్రి :

నేపాల్ లో, కోట్లాది హిందువుల ప్రఖ్యాత పశుపతినాథ్ ఆలయం వద్ద ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి కలిసి శివరాత్రికి హాజరు అవుతారు. వేలాది భక్తులు కూడా ప్రముఖ నేపాల్ శివ శక్తి పీఠము వద్ద మహాశివరాత్రికి హాజరు అయి జరుపుకుంటారు. ట్రినిడాడ్, టొబాగోలో,దేశవ్యాప్తంగా వేలాది హిందువులు 400 పైగా ఆలయాల్లో పవిత్రమైన మహాశివరాత్రి రోజు రాత్రి శివుడికి ప్రత్యేక అభిషేకాలు అందించటం ద్వారా గడుపుతారు. మహాశివరాత్రి రోజు పశుపతినాథ్ దేవాలయం నేతి దీపపు కుందులతో కన్నులపండుగా ఉంటుంది. వేలాది భక్తులు శివరాత్రి రోజు బాగమతి నదిలో స్నానము చేసి, శివరాత్రి పండుగ జరుపుకొంటారు. బంగ్లాదేశ్ లో హిందువులు కూడా మహాశివరాత్రి జరుపుకుంటారు. వారు శివుని దివ్య వరం పొందడానికి ఉపవాసం ఉంటారు. ఈ శివరాత్రి రోజున ఉపవాసం చేసిన యెడల పెళ్ళికాని యువతి/యువకులకు ఒక మంచి భర్త / భార్యను పొందుతామని విశ్వసిస్తారు.

దక్షిణ భారతదేశంలో మహాశివరాత్రి:

మహాశివరాత్రి పండుగను ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్నాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలలోని హిందువులు అన్ని దేవాలయాలలో శివుని భక్తిభావంతో పండుగ జరుపుకుంటారు. శివుని (మొదటి) ఆది గురువుగా భావిస్తారు. శివుడు నుండి యోగ సంప్రదాయం ఉద్భవించింది.

సంప్రదాయం ప్రకారం, మానవ వ్యవస్థలో శక్తి సహజంగా, సైద్ధాంతికంగా ఉంది, ఆ శక్తి పెంపొందేందుకు ఈ రాత్రి శక్తివంతమైన గ్రహ స్థానాలు అటువంటివి ఉన్నాయి.

రాత్రి అంతా తెలుసుకుంటూ (జాగరూకత), మెలుకువగా ఉన్న ఒక వ్యక్తి, శారీరక ప్రయోజనకరంగా, ఆధ్యాత్మికంగా క్షేమాన్నిపొందుతాడు అని చెబుతారు.

ఈ రోజు, అటువంటి శాస్త్రీయ సంగీతం, నృత్యం వంటి వివిధ రంగాలలో నుండి కళాకారులు మొత్తం రాత్రి అంతా జాగారం చేస్తారు. ఆధ్యాత్మిక శక్తి తపస్సు, యోగ, ధ్యానం వాటి అభ్యాసంతో క్రమంగా, వేగంగా జీవితం యొక్క అత్యధికంగా మంచిని చేరటానికి. ముక్తి పొందడానికి నిర్వహిస్తారు.

ఈ రోజు, ఉత్తర ధ్రువం లోని గ్రహ స్థానాలు అంతా బలమైనవిగా ఉత్ప్రేరకాలు చర్యతో ఒక వ్యక్తి ఎక్కువ సులభంగా అతని లేదా ఆమె ఆధ్యాత్మిక శక్తి పెంచడానికి సహా యంగా ఉంటాయి. మనమంతా మహాశివరాత్రి పండుగ జరుపుకుందాం. శివుని భక్తి భావంతో సేవిద్దాం. మహా శివరాత్రి శుభాకాంక్షలు.

-శారద శృంగేరి
9490261119

శివయ్య.. శివయ్య..

శివయ్య.. శివయ్య..
ఓం నమశివాయ
భూలోకాన మళ్లీ వెలిసి
ముసుగుల్లో దాగిన మనసులను
నిజం ముందుంచు నాథా
జటాజూటంలో గంగను దాచుకున్నవాడా,
కాలగ్ని నయనంతో అహంకారాన్ని
దహించే వాడా,
నీ త్రినేత్రం ఒక్క చూపు సరిపోతుంది
అంధకారాన్ని చెరిపేయడానికి?
నీలకంఠుడా?
విషాన్ని మింగి లోకాన్ని కాపాడినవాడా,
ఇప్పుడు మనుషుల హృదయాల్లో
పేరుకుపోయిన
ద్వేషవిషాన్ని తొలగించు
డమరుకం మోగించు శంభో!
మానవత్వం మేల్కొనేలా
నర్తనమాడి కాలాన్ని కదిలించు,
ధర్మం మళ్లీ నిలబడేలా
శివయ్య?
ముసుగులోని మనిషిని మార్చు,
మనిషిలోని మానవత్వాన్ని మేల్కొలుపు,
భూమి మళ్లీ పుణ్యక్షేత్రం అయ్యేలా
నీ కృప కురిపించు మహాదేవా
ఓం నమశివాయ?

-ఎలగొండ రవి
9848770345

ఈశ్వర తత్త్వము

నీలిగగనము ఆ మేని వర్ణము
కారు మేఘము జటాజూటము
సూర్య మండలము త్రినేత్రము
చంద్ర శీతలము మందహాసము
అంబర రూపము ఈశ్వర స్వరూపము.

నీల కంఠము నాగ భూషణము
కర కమలము త్రిశూల డమరకము
చిరుత చర్మము శివ కటి వస్త్రము
విభూది భూషితము ఆ దేహము
వేదాంత జ్ఞానము ఈశ్వర తత్త్వము.

కాటివాసము హర నివాసము
ప్రణవ నాదము శంఖారావము
ప్రళయ గర్జనము తాండవనాట్యము
చండ ప్రచండము రుద్ర రూపము
అశాశ్వత జీవితము ఈశ్వర సంకేతము.

-కందాళం రజనీ రాణి
94877 08043

మున్సిపల్ ఫలితాలతో రెండు పార్టీల పొత్తుకు తొలి అడుగు: కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 14: మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత (ఐజీలతిబిష్టజీ) వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కంచుకోట ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ బలహీనపడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆర్ఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తానంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆర్ఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. సీపీఐ అడగకుండానే.. కొత్తగూడెంలో సీపీఐకు కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇవ్వటం దిగజారుడే అని చెప్పుకొచ్చారు.

కేసీఆర్, బీఆర్ఎస్‌ను అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు ఎన్ని మాటలు అన్నారో కేటీఆర్‌కు గుర్తు లేదా అని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని ఆరోపణలను కేటీఆర్ ఒప్పుకున్నట్లేనా అని కవిత నిలదీశారు. కార్మికుల కోసం సీపీఐకు మద్దతు అంటోన్న కేటీఆర్ నయ వంచన చేసుకుంటున్నారని అన్నారు. అవసరం వచ్చినప్పుడు.. బీఆర్ఎన్‌కు కార్మికులు గుర్తొస్తారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని మున్సిపల్ ఫలితాలు చెప్తున్నాయన్నారు. మున్సిపాలిటీలను తీర్చిదిద్దానని చెప్పుకుంటోన్న కేటీఆర్.. ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ఈ స్థానాలు రావడమే ఎక్కువ అన్నట్లు కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. 'నేనే రాజు నేనే మంత్రి.. సీఎం పదవి ఆరు నెలలు బోనస్' అంటోన్న రేవంత్.. రైతుల బోనస్ గురించి

మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు.

'జాగృతిపై కామెంట్స్ చేస్తోన్న వారికి చెప్తున్న.. ఇది జస్ట్ ట్రైలర్.. పిక్చర్ బాకీ హై' అని అన్నారు కవిత. కరీంనగర్ కార్పొరేషన్ కోసం బీజేపీ అష్టకష్టాలు పడుతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తప్ప బీజేపీ ఎక్కడా లేదన్నారు. సింగరేణి ఎన్నికల్లో కూడా ఏఐఎఫ్‌బీతో కలిసి జాగృతి పోటీ చేస్తుందని ప్రకటించారు. 40కి పైగా స్థానాల్లో జాగృతి, ఏఐఎఫ్‌బీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు కవిత. వడ్డేపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రలోభాలకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎవరికి మద్దతివ్వాలో స్థానిక జాగృతి నేతలు డిసైడ్ చేసుకుంటారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించి ప్రభుత్వ సొమ్ముతో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారని కవిత ఆరోపించారు. గతంలో 90 శాతం గెలిచిన బీఆర్ఎస్.. 17 సీట్లకు పడిపోవటం దారుణమన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ ముందే డిసైడ్ అయిందని కవిత వ్యాఖ్యలు చేశారు.

ఆటో బోల్తాపడి ఇద్దరు మృతి

అమరావతి, ఫిబ్రవరి 14: పొగాకు కోతలకు వెళుతుండగా.. ఆటో బోల్తాపడి ఇద్దరు మృతిచెందగా, మరికొందరు గాయపడ్డ ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని లింగసముద్రం మండలం కే సముద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. పోగాకు కోతలకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మరికొంతమంది సైతం గాయపడ్డారు.

డీడీఏ గ్రీన్ ఎక్స్‌పో 2026ను ప్రారంభించిన లెఫ్టినెంట్ గవర్నర్

హైదరాబాద్, ఫిబ్రవరి 14: స్థిరమైన పట్టణ అభివృద్ధి తదుపరి దశను రూపుదిద్దుతూ, గ్రీన్ ఢిల్లీ పట్ల తన కట్టుబాటును వ్యక్తపరుస్తూ ఢిల్లీ గౌరవ లెఫ్టినెంట్ గవర్నర్ వీ.కే. సక్సేనా ఈరోజు జాతీయ రాజధానిలోని బాన్సేరా వద్ద తొలి డీడీఏ గ్రీన్ ఎక్స్‌పోను ప్రారంభించారు.

'బియాండ్ గ్రోత్: రీ-ఇమాజినింగ్ అర్బన్ ఫ్యూచర్స్' అనే థీమ్‌తో రెండు రోజుల పాటు జరుగనున్న ఈ ఎక్స్‌పోలో సీనియర్ ప్రభుత్వ నాయకులు, పట్టణ ప్రణాళిక నిపుణులు, వాతావరణ శాస్త్రవేత్తలు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొంటున్నారు. అదనంగా, దేశంలోని ప్రముఖ జాతీయ సంస్థలతో పలు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఇవి ఢిల్లీలోని ప్రజా ప్రదేశాల భవిష్యత్తులో ఒక మార్పు దిశగా కీలక ఘట్టంగా కానున్నాయి.

జాతీయ రాజధానిలో పచ్చదనాన్ని ప్రోత్సహించాలనే సంకల్పంతో లెఫ్టినెంట్ గవర్నర్

డీడీఏ గ్రీన్స్ లోగో డీడీఏ గ్రీన్స్ ఇయర్ బుక్ 2026ను కూడా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఈ ఎక్స్‌పో ఢిల్లీకి మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా, ఆశాజనకంగా ఉండే భవిష్యత్తు వట్ల పునరుద్ఘాటిస్తుంది'' అన్నారు. ఈ ఎక్స్‌పో కేవలం సమావేశాలు, ప్రదర్శనలకే పరిమితం కాదని, ప్రజల సంబంధించినదిఅని ఆయన అన్నారు . "తమ ఇళ్ల బయట చిన్న పచ్చటి ప్రదేశాలను పెంచే, తమ పిల్లలకు స్థానిక పక్షుల గురించి బోధించే, మొక్కలు నాటి వాటిని సంరక్షించే వేలాది ఢిల్లీ వాసులే పర్యావరణ నిజమైన హీరోలు" అని అన్నారు.

మూడేళ్ల క్రితం వరకు పాడైపోయిన, కాలుష్యంతో నిండిన ప్రదేశం 'గ్రీన్ ఎక్స్‌పో'కి వేదికవుతుందని ఎవరూ ఊహించలేరని ఆయన పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com